
# యక్ష ప్రశ్నలు



స్వామి సుందర చైతన్యానంద

# యక్షప్రశ్నలు



జ్ఞానబ్రహ్మ, ఆర్షవిద్యా వాచస్పతి

స్వామి సుందర చైతన్యానంద

స్వర్ణోత్సవ కెరటాలు - 2

# యక్షప్రశ్నలు

స్వామి సుందర చైతన్యానంద

ప్రథమ కెరటం ........... 1997 ........... 3000 ప్రతులు

(సర్వస్వామ్యములు ట్రస్ట్‌వి)

ప్రతులకు :
సుందర చైతన్య ఆశ్రమం
ధవళేశ్వరం : 533 125
☎ : 77378

వెల: రూ. 15/-


ముద్రణ : ☎ : 31575
శ్రీ లక్ష్మీ గణపతి బైండింగ్ వర్క్స్,
కొవ్వూరు - 534 350

294-51
చైత - 002
9815
Cat-2713
సుందర చైతన్య గ్రంథాలయ
C.No 94563
హైదరాబాద్



జ్ఞానబ్రహ్మ

పూజ్యశ్రీ స్వామి సుందర చైతన్యానంద



# ప్రస్తావన

తింటే గారెలు
కంటే కొడుకులు
వింటే భారతం ...... ఇలాగే వింటున్నాం చాలా కాలం.
"తింటే - కంటే" అని అంటూ ఉంటే జరిగేది స్తవం.
ఒకనాడు ఇవి అడుగంటేవే అనేది అనకపోయినా వాస్తవం.
"వింటే" మాత్రం వంటబట్టేదే నని గంటకొట్టి మరీ చెప్పొచ్చు.
పంచమ వేదంగా ప్రఖ్యాతి గడించిన మహాభారతం పద్దెనిమిది పర్వాల పవిత్ర గ్రంథం. పారాశర్యుని వచస్సరోజము నుండి విరజిమ్మబడిన విజ్ఞాన గంధం. విమల విజ్ఞాన గంధం. నిర్మల సుజ్ఞాన గంధం.
బ్రతుకుకు అర్థం చెప్పే గ్రంథం.
బుద్ధికి అద్దం పట్టే గ్రంథం.
ధర్మాన్ని అందల మెక్కించిన గ్రంథం.
జ్ఞానాన్ని ఆవిష్కరించిన గ్రంథం.
పావనాత్ములైన పాండవులూ ఇక్కడే
కఠినాత్ములైన కౌరవులూ ఇక్కడే
కుయుక్తుల శని శకునీ ఇక్కడే
ఆదిమధ్యాంత రహితుడు, ఆదిదేవుడు అయిన వాసుదేవుడూ ఇక్కడే.
మానవుల మధ్య మాధవుడుగా
భామల మధ్య యాదవుడుగా
కురు పాండవుల మధ్య రాయబారిగా
పార్థుని ముందు సారథిగా
పరమాత్మ జాజ్జ్వల్యమానమైనది ఇక్కడే, ఈ భారతం లోనే.
ఈ భారతావనిలోనే.
ఈ మహాభారతం లోనే.
వినదగిన వింతలన్నీ ఇందులోనే
తినదగిన వంటలన్నీ ఈ విందులోనే

*మహాభారతం ధర్మప్రధానమైన గ్రంథం. వ్యక్తి ధర్మాన్ని, కుటుంబ ధర్మాన్ని, సమాజధర్మాన్ని, రాజధర్మాన్ని, దేశధర్మాన్ని, విశ్వధర్మాన్ని వైభవంగా విశ్లేషించిన గ్రంథం. ధర్మం చాలా విలువైనది. కానీ సులువైనది కాదు.*

సూక్ష్మా గతిర్హి ధర్మస్య సూక్ష్మత్వాత్ బహునిర్ణయః

*"ధర్మ మార్గము చాలా సూక్ష్మమైనది. ఈ సూక్ష్మత్వము వలన ధర్మమును ఒకదృక్కోణంనుండి నిర్ణయించేందుకు వీలులేదు" అని శాసించింది శాంతిపర్వము.*

తర్కో ఽప్రతిష్ఠః శ్రుతయో విభిన్నాః
నైకో ఋషిర్యస్య మతం ప్రమాణం
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
మహాజనో యేన గత స్స పన్థాః ॥

*"తర్కానికి స్థిరత్వము లేదు. వేదాలు విభిన్నంగా ఉన్నాయి. ఈ ఋషి పలికిందే ప్రమాణం అని చెప్పేందుకు వీలులేదు. ధర్మతత్త్వము నిగూఢమైనది. కనుక మహాత్ముడు నడిచినదియే ఇతరులకు మార్గము".*

*ఇది ధర్మమార్గము. ధర్మపుత్రుడు భారతంలో ఆచరించి చూపిన మార్గము.*

యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న తత్ క్వచిత్

*"ఇందులో ఉన్నది మరొకచోట ఉండొచ్చు. ఇక్కడ లేనిది మాత్రం మరొకచోట ఉండదు" అని భారతాన్ని గూర్చి ఆర్యోక్తి. అందరికీ తెలిసిన సూక్తి.*

*సూక్ష్మతరమైన ధర్మాన్ని ఎలుగెత్తి చాటింది భారతము. గళమెత్తి పలికాడు వ్యాసుడు.*

ఊర్ధ్వబాహు ర్విరౌమ్యేషః న చ కశ్చిచ్ఛృణోతి మామ్
ధర్మాదర్థశ్చ కామశ్చ స కిమర్థం న సేవ్యతే ॥

*"చేతులెత్తి చాటి చెప్పాను. గళమెత్తి గర్జించాను. ఎవరూ వినడంలేదు. అర్థకామాలు ధర్మం నుండే పుడుతాయి. ధర్మాన్నెందుకు ఆచరించరు?" అని స్వర్గారోహణ పర్వంలో వ్యాసమహర్షి ప్రశ్నిస్తాడు.*

*పద్దెనిమిది పర్వాల మహాభారతంలో మూడవది వనపర్వం. అదే అరణ్యపర్వం. అందరికీ పర్వం. గ్రంథానికే గర్వం.*

*కానలలో జీవించి, కష్టాలలో జీర్ణించి అరణ్యవాసాన్ని పూర్తిచేసుకున్నారు పాండవులు. అజ్ఞాతవాసం సాగుతోంది. అట్లునారగించినట్లు ఇక్కట్లననుభవిస్తూ కామ్యక వనమునుండి ద్వైతవనానికి చేరారు.*

కామ్యకర్మలు చేర్చేది ద్వైత ప్రపంచానికే కదూ!

ద్వైత జీవనంలో దైన్యం తప్పతుందా! అదే జరిగింది.

అగ్నిర్మథనానికి ఉపకరించే అరణిని మృగమొకటి అపహరించుకొని పోయింది. అరణిని పోగొట్టుకున్న బ్రాహ్మణుడు పాండవుల్ని ఆశ్రయించాడు. అరణిని తెచ్చివ్వమని అర్థించాడు.

సజ్జనుల్ని రక్షించవలసిన ధర్మము రాజుకుంది. సరేనని పయనమయ్యారు పాండవులు. మృగాన్ని వెంబడించి తరిమారు. వెన్నంటి తిరిగారు. విల్లంబులు చేబూని ఉరికారు. మృగము తప్పించుకొని పారిపోయింది. పాండవులు అలసిపోయారు. కుక్షి ఆకలంటోంది. జిహ్వ దాహమంటోంది. వేడెక్కిన చర్మం చల్లదనాన్ని వాంఛిస్తోంది. వటవృక్ష ఛాయలో విశ్రమించారు వినీతులైన పాండుతనయులు.

ఆకలి ..... దప్పిక .... ఆవేదన ..... ఏకమయ్యాయి.

"ధర్మమార్గాన్ని మనం అంటిపెట్టుకొనే ఉన్నాం. కానీ ఏం లాభం? బాధలమయమే మన బాటంతా!" అన్నాడు నకులుడు.

"నిండు సభలో ద్రౌపదిని దుశ్శాసనుడు ఈడ్చినపుడు అప్పడే, అక్కడే వాడ్ని ఊడ్చేయకపోవడమే ఈ ఇక్కట్లకు కారణము" అని పటపట మనిపించాడు భీముడు.

"కర్ణుణ్ణి నిరసించక పోవడమే మనం చేసిన తప్ప" అని అర్జునుడు.

"శకునిని వధించక పోవడముతోనే దుశ్శకునాలు ఆరంభమయ్యాయి" అన్నాడు సహదేవుడు.

నలుగురు నడిచే బాట నాలుగు విధాలైనపుడు సహకరించక పోవడమే సముచితమని భావించి మౌనం పాటించాడు ధర్మరాజు.

"ప్రస్తుతం మనమంతా దాహంతో బాధపడుతున్నాం. నకులా! మనకు వెంటనే నీరు అవసరమని వేరే చెప్పాలా! ఆ చెట్టెక్కి చూడు. సమీపంలో సరోవరమేదైనా ఉందేమో!" అన్నాడు ధర్మరాజు.

చెట్టెక్కాడు నకులుడు. నొసటిపై అరచేతి నుంచి అటూ ఇటు అన్వేషిస్తూ పరీక్షగా చూశాడు.

అన్నా! దగ్గరలో జలాశయ మున్నట్లు తెలుస్తోంది. పచ్చని చెట్లు గుబురుగా గోచరిస్తున్నాయి. పక్షుల ధ్వనులు వినిపిస్తున్నాయి" అన్నాడు నకులుడు.

"అయితే నువ్వెళ్ళి నీరు తీసికొని రా!" అన్నాడు ధర్మరాజు.

నకులుడు బయలుదేరాడు. జలాశయాన్ని సమీపించాడు. నీరు త్రాగేందుకు దోసిలి పట్టాడు.

"ఆగు! ఏమిటి ఆ దుష్కార్యము! నాది ఈ సరస్సు. దీనిపై ఎందుకు మరలింది నీ మనస్సు? నేనడిగే ప్రశ్నలకు సమాధాన మిస్తేనే నీకు లభిస్తుంది నీరు" అని ఒక శబ్దం వినిపించింది.

నకులుడు ఆ శబ్దాన్ని పట్టించుకోలేదు. నీటిని నోట పట్టించుకున్నాడు. అంతే నకులుడు నేల రాలాడు. ప్రాణాలు లేచిపోయాయి.

కొంతసేపటికి సహదేవుడు ప్రవేశించాడు. నకులుని మార్గాన్నే అనుసరించాడు. మరికొంతసేపటికి అర్జునుడు అరుదెంచాడు. మూడో వాడుగా భూమిని మూజూసాడు. భీముడు రానేవచ్చాడు. పోనేపోయాడు.

పోకే గాని రాకలేని తమ్ముళ్ళను గూర్చి ఆలోచిస్తూ జలాశయం వద్దకు కదలి వచ్చాడు జ్యేష్ఠుడు, శ్రేష్ఠుడు అయిన ధర్మజుడు.

అసువులుబాసి, అవనిపై పడియున్న తమ్ముళ్ళను చూశాడు. దూరంగా పడియున్న విల్లంబులను వీక్షించాడు. శోకభాష్ప పరిప్లుతుడై రోదించాడు. చింతా సమన్వితుడై పెద్దగా విలపించాడు.

"రణభూమిలో దుర్యోధనుని తొడలను విరిచేస్తానని ప్రతిజ్ఞ చేశావే! ఇలా పడుకున్నావేమి? ఓ వీరుడా! నా ఆశ నిరాశ అయినట్లేనా! భీమా! నీవే కదా నా ధీమా!

"అయ్యో! ధనంజయా! నీవూ పోయావా! ధనమూ, బలమూ రెండూ మాకు దూరమయ్యాయా! అర్జునా! నిన్ను చూసుకొనే గదా నా గర్జన!

"నకులా! సహదేవా! మీరూ వెళ్ళారా! నేనెంత దుష్టుణ్ణి. నా హృదయం వజ్రము కంటె గట్టిది. లేకుంటే, అది ఇంకా ముక్కలు కాలేదెందుకని?

"బిడ్డలారా! మీరందరూ వీరులు కదా! శూరులు కదా! శత్రుంజయులు కదా! మిమ్మల్ని జయించిన ఆ వీర శత్రువు ఎవరు? ఎదురుదెబ్బ తీయలేకపోయారా! మీ దేహాలపై దెబ్బలు లేవు. విల్లంబులు దూరంగా పడి విశ్రాంతి తీసుకుంటున్నాయి. మీరు అన్యులతో పోరాడినట్లు చిహ్నాలు లేవు.

"ఆ శనిగాడు ......... వాడే ....... శకునిగాడు....... ఇది వాడి దుష్కార్యం కాదుగదా! "మరణించిన నా తమ్ముళ్ళ ముఖాలు ప్రసన్నంగానే ఉన్నాయి. మహాబలశాలురైన నా సోదరులను వధించే శక్తి యముడికి తప్ప మరొకరి కుండదు;" అని భావిస్తూ, చింతాక్రాంతుడై విలపించసాగాడు ధర్మరాజు.

'తస్యాసీ న్న విషేణేద ముదకం దూషితం యథా!'

"ఈ జలము విషయుక్తమై చెడిపోయిందేమో అనే ఆలోచన ధర్మరాజుకు రాలేదు" అని వ్యాసుడు వ్యాఖ్యానిస్తాడు. అనుమానము ప్రమాణముగా నిలిచిన సమయాల్లో ఆలోచనలు అనేక కోణాల్లో సాగుతాయి. సాగాలి కూడా.

"కుమారా! తమ్ముళ్ళతో కలిసి కానలకెళ్ళిన నీవు ఒక్కడివే వచ్చావు. నీ తమ్ముళ్ళు ఎక్కడి కెళ్ళారు? అని తల్లి అడిగితే ఏం చెప్పేది?" అని ధర్మరాజు విలపించినట్లు సున్నితంగా హృదయాన్ని కదుపుతుంది ఆంధ్రభారతము.

సీ॥ పుత్రులు దుఃఖార్తి బొగులుట కనిశంబు బొక్కుచు నున్న యప్పుణ్య చరిత
మా తల్లి పాండుని మహిషి నా కెదురుగా వచ్చి కౌగిట జేర్చి వత్స నాడు
దమ్ము గుఱ్ఱలు నీవు దగ విపినంబున కరిగితి రిప్పు డయ్యనుజులెందు
జనిరి నీ వొక్కండ చనుదెంచి తిది యేమి యనిన నా యమతోడ నకటయేమి

ఆ। యనగ నేర్చువాడ నాచార్య విదురశాం తనవక్పులు నను ముదంబుతోడ
గుశల మడిగిరేని గుశల మే మనువాడ దలుగ రాని యెడరు దగిలె నాకు

అని ధర్మజుడు విలపించినట్లు ప్రముఖమైన ప్రేమబంధాన్ని స్పృశిస్తూ రచిస్తాడు ప్రబంధ పరమేశ్వరుడైన శంభుదాసుడు ఎఱ్ఱాప్రెగడ.

ఇలా అనేక విధాల దుఃఖిస్తూ, దప్పికను ఓర్చుకోలేక నీటిని త్రాగుటకై సరోవరములోకి దిగబోతున్నాడు ధర్మరాజు. ఇంతలో గగనం గర్జించింది. ఆకాశము నోరు విప్పింది. "రాజకుమారా! ధర్మపుత్రా! నీ సోదరులను వధించింది నేనే. నే నడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పి ఆ తరువాత నీటిని ముట్టుకో. లేదా, నీళ్ళు నీ నోటికి చేరేలోగా నీవు నీ తమ్ముళ్ళను చేరుతావు."

"ఎవరు నువ్వు! నువ్వెవరైనా సరే. దేవ, గంధర్వ, అసుర రాక్షసాదులు ఎదురొడ్డలేని నా తమ్ముళ్ళను సంహరించావు. నీవు సామాన్యుడివి మాత్రము కావు. ఇంతకీ నా తమ్ముళ్ళను నీవు ఎందుకు వధించినట్లు? ఏమి ఆశించి ఈ పనిచేశావు? ఉద్విగ్న హృదయంతో అడుగుతున్నాను. నువ్వెవరు?" అన్నాడు ధర్మరాజు.

ధర్మరాజు ముందు యక్షుడు ప్రత్యక్షమయ్యాడు. వికృతనేత్రాలు కలిగి, పర్వతదేహుడై, అగ్నివలె ప్రకాశిస్తూ, మేఘగంభీర నాదంతో ఇలా పలికాడు.

"రాజా! నా తప్పేమీలేదు. తప్పంతా నీ తమ్ముళ్ళదే. వద్దని అనేకసార్లు వారించాను. నీటిని ముట్టుకోవద్దని చెప్పాను. అయినా వినలేదు. అంతే. వారి ప్రాణాల్ని తరిమేశాను.

"ధర్మరాజా! ప్రాణం కావాలనుకుంటే ఇక్కడ పానం మరచిపోవాలి. లేదా, నా ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలి. చెప్పగలిగితే ప్రాణాలుంటాయి. పానాలుంటాయి;" అన్నాడు యక్షుడు.

"యక్షుడా! ఇతరుల సంపదను సజ్జనులు వాంఛించరు. నీ సొత్తుతో నాకు లేదు పొత్తు. ఇంతకీ నీ ప్రశ్నలేమిటి? అడుగు. నా బుద్ధి ననుసరించి జవాబు లిస్తాను" అన్నాడు ధర్మరాజు.

యక్షుడు ప్రశ్నిస్తాడు. యక్షుని ప్రశ్నలకు ధర్మరాజు సమాధానాలిస్తాడు. ఇవియే యక్షప్రశ్నలు.

## ధర్మబుద్ధి

"ఉండవయ్యా! నువ్వొకడివి పానకంలో పుడకలా! నా సమస్యలతో నేను సతమత మవుతుంటే, తగుదునమ్మా అంటూ తరలివచ్చావు నన్ను సలహా అడిగేందుకు".......

"అబ్బ! కాసేపు ఆగవయ్యా! రైలు ఇంజనులా ప్రేగులు గోలచేస్తున్నాయి. నాలుగు ముద్దలు లోపలికెళ్ళనీ. ఆకలి కడుపుతో ఏం మాట్లాడేది? ఏం చెప్పేది? సాంబారన్నం లోనికెళ్తేనే సమాధానాలు పైకి ఉబికి వస్తాయి.

"ఇదిగో చూడు నా మనసంతా కల్లోలంగా ఉంది. ఇప్పుడు నువ్వేమడిగినా నా నుండి ఏమీరాదు, ఏడుపు తప్ప. వెళ్ళి, రేపురా! నీవడిగిన దానికి సమాధానం చెబుతా!"........

ఈ విధమైన మాటలు మనకు వినిపిస్తూ ఉంటాయి తరచుగా. మరి, ధర్మరాజు పరిస్థితి చూడండి.

దేహం అలసి ఉంది. దాహంతో దేహం నీరసించి ఉంది. నాలుక ఎండిన కట్టెపుల్లలా ఉంది.

ఇక మనసంటామా!

సోదరుల్ని పోగొట్టుకొని శోకమయంగా ఉంది. ఉద్విగ్న హృదయంతో కుమిలిపోతున్నట్లు ధర్మరాజే చెప్పకున్నాడు.

దేహం అలసిపోయింది. ఇంద్రియాలు సొమ్మసిల్లిపోయాయి. మనసు విచలితమై ఉంది. బుద్ధి ముక్కలై మిగిలింది. హృదయం అయోమయంగా ఉంది.

ఈ పరిస్థితిలో యక్షుని ప్రశ్నలకు సమాధానాలా!

ఎవరికి సాధ్యమిది! ధర్మరాజుకే సాధ్యం. ధర్మబుద్ధి గలవారికే సాధ్యం.

ధర్మజీవనం మహోన్నతమైంది. అది దేహబాధల్ని లెక్కచేయదు. ఇంద్రియ పెనుగులాటలను లక్ష్యపెట్టదు. మనోబాధలకు క్రుంగదు. హృదయ తాపానికి చలించదు. అదొక వీరోచిత పోరాటం. ఆ పోరాటం లోనే సిద్ధిస్తుంది జీవితలక్ష్యం. స్వామి వివేకానంద "కాళీమాత" అనే తన ఆంగ్ల పద్యములో ఇలా అంటారు:

**Who dares misery love**
**And hug the form of death**
**Dance in destruction's dance**
**To him the Mother comes ........**

దుఃఖాన్ని ప్రేమించగల ధీరునికి
మృత్యువును కౌగిలించుకోగల వీరునికి
ప్రళయకాల తాండవంలో నర్తించే శూరునికి
అందుతుంది అమ్మదర్శనం.

ధర్మజీవనానికి అలవాటుపడిన సాహసవంతుడు ధర్మరక్షణకు ప్రాణాలొడ్డి శ్రమిస్తాడు. ధర్మాన్ని రక్షిస్తాడు. అంతేకాదు. ధర్మంచేత రక్షింప బడుతాడు.

## ధర్మో రక్షతి రక్షితః

ఈ సత్యానికి ప్రతీకమే, ప్రతిరూపమే ధర్మరాజు.
యక్షప్రశ్నలంటేనే సమస్యల తోరణాలని అర్థం.
ప్రశ్నలూ గుహ్యామే. జవాబులూ గుహ్యామే.
గుహ్యామైన విషయాలకు వివరణలే దారిదీపాలు.

భారతాంతర్గతమైన ఈ యక్షప్రశ్నలను వ్యాఖ్యానించిన నీలకంఠ భాష్యము విషయాన్ని సుగ్రాహ్య మొనర్చుటయే గాక సులభతరం చేసింది. వ్యాఖ్యాతలు కళ్ళెము లేని గుఱ్ఱాలవలె పరుగులెత్తకుండా కాపాడింది.

నీలకంఠుని నీడలో నిలిచి, నీలకంఠీయ మార్గంలో నడిచి, యక్షప్రశ్నలకు ప్రేమతో జోడించబడుతున్న ఈ చైతన్య భాష్యము ముముక్షువులకు కాంతిపుంజము కాగలదని విశ్వసిస్తూ,

విశ్వనాథుని విశిష్టారాధనలో
మీ
స్వామి సుందర చైతన్యానంద

ఆశ్రమం,
తేది.

# యక్షప్రశ్నలు

# యక్షప్రశ్నలు

యక్ష ఉవాచ :-

శ్లో॥ కిం స్విదాదిత్యం ఉన్నయతి కే చ తస్యాభితశ్చరాః
కశ్చైన మస్తం నయతి కస్మింశ్చ ప్రతితిష్ఠతి ॥ 1

యక్షుడు ఇలా పలికెను :-

భావము :- సూర్యుని ఏది ఉదయింప చేయుచున్నది? సూర్యుని చుట్టు చరించువారెవరు? సూర్యుని ఏది అస్తమింప చేయుచున్నది? సూర్యుడు దేనియందు సుప్రతిష్ఠుడై ఉన్నాడు?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ బ్రహ్మాదిత్య మున్నయతి దేవా స్తస్యాభితశ్చరాః
ధర్మ శ్చాస్తం నయతి చ సత్యేచ ప్రతితిష్ఠతి ॥

యుధిష్ఠిరుడు ఇలా పలికెను :-

భావము :- బ్రహ్మము సూర్యుని ఉదయింప చేయుచున్నది. సూర్యుని చుట్టు దేవతలు చరించుచున్నారు. ధర్మము సూర్యుని అస్తమింప చేయుచున్నది. సూర్యుడు సత్యమునందు సుప్రతిష్ఠుడై ఉన్నాడు.

## వ్యాఖ్య

యక్షుని ప్రశ్నలు అక్షయనిధిని నిర్ణయించి పొందుటకై ఉద్దేశింపబడినవి అగుటచేత ప్రారంభములోనే దృష్టి ఊర్ధ్వంగా ఆకాశము వైపు సాగి సూర్యుని చేరింది.

### *తరతి శోక మాత్మవిత్*

"ఆత్మవిదుడు శోకమును దాటుచున్నాడు" అని ఉపనిషత్ ప్రవచించుచున్నది. అట్టి ఆత్మజ్ఞానమును పొంది, దుఃఖానికి శాశ్వతంగా దూరము కావలెననెడి భావనయే ఈ ప్రశ్నోత్తరాల వెనుక నిలిచిన స్పందన యని శ్రీనీలకంఠులు అభిప్రాయపడ్డారు. ఆదిత్యుడనగా జీవాత్మ అని వ్యాఖ్యానించారు.

జీవాత్మ ఉదయించుటకు పరమాత్మయే కారణమై ఉన్నందున సూర్యుని ఉదయింప చేయునది బ్రహ్మము అని ధర్మరాజు సమాధాన మిచ్చాడు. ఆదిత్యుని ఆత్మపరంగా సూర్యోపనిషత్ కూడా నిర్దేశించి యున్నది.

*నమస్తే ఆదిత్య త్వమేవ ప్రత్యక్షం త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి*

"ఓ ఆదిత్యుడా! నీకు నమస్కారము. నీవే ప్రత్యక్షముగా బ్రహ్మమువై ఉన్నావు". వ్యక్తి అంతర్యంలో భాసిస్తూ దేహేంద్రియ మనోబుద్ధులు చరించుటకు ఆధారమైనది, అవస్థాత్రయమునకు సాక్షియైనది ఆత్మయని ఉపనిషత్తుల నిర్ణయం. బాహ్యంలో మారుతున్న సమస్తానికి అధిష్ఠానమై, మారని సద్రూప చైతన్యమే బ్రహ్మమని చెప్పబడింది. కనుక ఆత్మకు బ్రహ్మమునకు అభేదమే గాని భేదం లేదు.

**సర్వం హ్యేతద్బ్రహ్మ ఉయమాత్మా బ్రహ్మ**

"ఈ సమస్తమైన ప్రపంచమూ బ్రహ్మమే. ఈ జీవాత్మకూడా బ్రహ్మమే" అన్నది మాండూక్యోపనిషత్తు.

ఈ సత్యము అనుభవానికి అందని దశలో జీవాత్మ పరమాత్మకన్నా వేరని భావించడం జరుగుచున్నది. ఈ భావనా ప్రవంతిలో జీవాత్మను కదిలించే శక్తి ఏదనే ప్రశ్న ఉదయించుచున్నది. బ్రహ్మము కన్నా అన్యంగా, భిన్నంగా రెండవ వస్తువు ఉండేందుకు వీలులేనందున జీవాత్మ ఉదయించుటకు కారణము బ్రహ్మమే అని ధర్మరాజు చెప్పడం జరిగింది.

తన కిరణజాలము చేత ఆదిత్యుడు జలాలను గ్రహించునట్లు శ్రోత్రాది ఇంద్రియాల ద్వారా శబ్దాది విషయాలను జీవుడు గ్రహించుచున్నాడు. ఆదానము చేయువాడై, అనగా గ్రహించువాడై ఆదిత్యుడు అనబడినాడు.

సూర్యుని చుట్టు తిరుగువారెవరు? అనెడి రెండవ ప్రశ్నకు దేవతలు, అని సమాధాన మిచ్చాడు ధర్మరాజు.

**"దివ్ క్రీడాదౌ"** ప్రకాశించునది అనెడి భావమును గ్రహించి 'దేవతలు' అనగా ఇంద్రియాలు అని భావించాలి.

గ్రహించువాడు ఆదిత్యుడని భావించాము కనుక జీవుడైన ఆదిత్యుడు ఏ ఇంద్రియాల ద్వారా విషయాలను గ్రహించుచున్నాడో అవియే ఆయన అనుచరులు.

దేవతలనగా శమదమాదులు అని నీలకంఠ భాష్యము. శమమనెడి మనోనిగ్రహము, దమమనెడి ఇంద్రియ నిగ్రహము సాధన కుపకరిస్తూ చుట్టూ చరిస్తుంటాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భమున స్థితిగతులు ప్రధానంగా తెలుస్తున్నాయేగాని మతిగతుల ప్రసక్తి రాలేదని భావించడం చేత జీవాత్మకు ఇంద్రియాలే అనుచరులని నేను వ్యాఖ్యానించడం జరిగింది. నా భావాన్ని మీ ముందుంచడమే గాని నీలకంఠీయముతో విభేదించడం కాదని సవినయంగా మనవి చేయుచున్నాను.

సూర్యుని అస్తమింప చేయునది ధర్మము అని ధర్మరాజు మూడవ ప్రశ్నకు సమాధాన మిచ్చాడు.

ఇచ్చట అస్తమించుట అనగా సహజస్థితిలో భాసించుట అని అర్థము. సూర్యుడు అస్తమించాడని మనం భావించినా తాను స్వస్థితిలో దివ్యంగా ప్రకాశిస్తూనే ఉన్నాడు. సూర్యుని గాంచలేని లోకాలు అంధకారంలో నిలిచినంత మాత్రాన సూర్యుడు లేడని చెప్పలేము.

'ఆదిత్యుడు' అని పిలువబడిన జీవాత్మ ఉదయించగనే ద్వైత ప్రపంచము గోచరమై, అనేక అనుభవాలు కలుగుతున్నాయి. ఇవియే లోకములు, లోకానుభవములు. ఇవన్నీ తిరుగ ఆత్మయందు లయించుటకు కారణమేదియో అదియే ధర్మమని గ్రహించాలి. కనుక జీవాస్తమయానికి ధర్మము కారణమని చెప్పబడింది.

**_ధరతి లోకానితి ధర్మః_**

ధర్మమనగా లోకాలను ధరించునది అని కూడా భావము.

ముందుగా నేను మనవి చేసినట్లు నీలకంఠభాష్యము సాధన మార్గంలో చరించుట చేత ధర్మమనగా కర్మ అని, ఉపాసన అని అభిప్రాయ పడటము జరిగింది. హృదయాకాశంలో ఆత్మజ్ఞాన భాస్కరుని దర్శించుటకు కర్మోపాసనలు సహకరించుట చేత, జీవాస్తమయానికి వాటిని కారణాలుగా శ్రీనీలకంఠులు పేర్కొన్నారు.

ఆదిత్యుడు సత్యము నందు సుప్రతిష్ఠుడై ఉన్నాడని ధర్మరాజు నాల్గవప్రశ్నకు సమాధాన మిచ్చాడు. కర్మోపాసనల ద్వారా గుణాతీతమైన సత్య పరబ్రహ్మము అనుభవానికి అందుచున్నదని నీలకంఠీయము.

ధర్మము ద్వారా జీవత్వము అస్తమించగనే సత్యము స్వప్రకాశమై భాసించుచున్నది. ఆత్మ పరమాత్మగా సుప్రతిష్ఠమైనదని భావము. అనగా ఆత్మ బ్రహ్మము కన్నా వేరై బ్రహ్మములో ఉందని భావము కాదు. ఈ స్థితిలో దేశకాలాదులు మెదల్లేవు, కదల్లేవు. ఇది జీవబ్రహ్మైక్యస్థితి. స్వస్వరూప జ్ఞానస్థితి.

**_బ్రహ్మవిదాప్నోతి పరం తదేషాఽ భ్యుక్తా సత్యం జ్ఞాన మనంతం_**
**_బ్రహ్మ, యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్ సోఽ శ్నుతే_**
**_సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి ।_**

"బ్రహ్మమును తెలిసినవాడు బ్రహ్మమే అగుచున్నాడు. ఆ బ్రహ్మము సత్యమైనది. జ్ఞానరూపమైనది. అనంతమైనది. ఎవడైతే తన హృదయ గుహలో ఆ బ్రహ్మమును తెలుసుకొనుచున్నాడో వాడు బ్రహ్మరూపుడై సర్వభోగముల ననుభవించినవాడు అగుచున్నాడు" అని తైత్తిరీయోపనిషత్తు.

జీవత్వమనేది బ్రహ్మము నాశ్రయించుకొని యున్నది. జీవాత్మ గడించే ద్వైతానుభవమునకు ఇంద్రియాలు అనుచరులై సహకరిస్తున్నాయి. సర్వానుభవముల

నుండి విడిపడి స్వరూపానుభూతిలో నిలుచుటయే ధర్మము. ధర్మమునందు నిలకడ కలిగి బ్రహ్మమై ఉండుటయే సత్యము. ధర్మరాజు చెప్పిన నాలుగు సమాధానముల లోని కేంద్ర విషయమిదియే.

శోకమును దాటవలె నన్నచో ఆత్మను సాక్షాత్కరించుకోవాలి. అది బయట జరగాలి అనేవారు భీరులు. లోపలే జరగాలి అనేవారు ధీరులు.

*తం ఆత్మస్థం యే అనుపశ్యంతి ధీరాః*

"తమ ఆంతర్యం లోనే ఆత్మను దర్శించువారు ధీరులు" అన్నది కఠోపనిషత్తు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కేనస్విచ్ఛ్రోత్రియో భవతి కేనస్విద్విన్దతే మహత్
కేనస్విద్ద్వితీయవాన్ భవతి రాజన్ కేన చ బుద్ధిమాన్ । 2

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :-** దేనిచేత మానవుడు శ్రోత్రియుడగును? దేనిచేత బ్రహ్మమును పొందును? దేనివలన రెండవది కలవాడగును? దేనిచే బుద్ధిమంతుడగును?

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ శ్రుతేన శ్రోత్రియో భవతి తపసా విన్దతే మహత్
ధృత్యా ద్వితీయవాన్ భవతి బుద్ధిమాన్ వృద్ధసేవయా ।

**ధర్మరాజు చెప్పెను :-**

**భావము :-** శ్రవణము చేయుటచేత శ్రోత్రియుడు అగును. తపస్సుచేత బ్రహ్మమును పొందును. ధృతిచేత రెండవది కలవాడగును. వృద్ధులను సేవించుట వలన బుద్ధిమంతుడగును.

## వ్యాఖ్య

శ్రుతులను శ్రవణము చేసినవాడు శ్రోత్రియుడు. శ్రుతులంటే వేదములని సామాన్యార్థము ఉన్నా ఇక్కడ శ్రుతులను అధ్యయనం చేయడమంటే ఉపనిషత్తులను అధ్యయనము చేయడమని భావము. ఇది కూడా సంప్రదాయమునకు భిన్నం కానపుడే శ్రుతము శ్రోత్రీయ మవుతుంది.

ఉపనిషత్తులు కేవలం గ్రంధములని భావించరాదు. అవి పోతపోసిన ఆత్మజ్ఞాన స్వరూపాలు కనుక ఉపనిషత్తులను అధ్యయనము చేయువారు ఆత్మవిదులై శోభిస్తారు.

***... తేషాం అవిద్యాదేః సంసార బీజస్య విశరణాత్, హింసనాత్, వినాశనాత్ ఇత్యనేన అర్థయోగేన విద్యా ఉపనిషదిత్యుచ్యతే।***

"ఉపనిషత్తును ఆశ్రయించు వారిలో సంసారమునకు బీజరూపమైన అజ్ఞానము నిర్మూలింపబడుతుంది. ముక్కలై పోతుంది. నశించిపోతుంది. ఈ విధమైన అర్థయుక్త వివరణలచే ఉపనిషత్తు విద్య అని పిలువబడింది" అని శ్రీశంకరులవారు కఠోప నిషద్భాష్యాన్ని ప్రారంభిస్తూ చెబుతారు.

గురుముఖతః శాస్త్రమును అధ్యయనం చేసిన శ్రోత్రియుడు తపస్సు ద్వారా మహత్తు (బ్రహ్మము)ను పొందుతాడు అని ఈ శ్లోకంలో రెండవ ప్రశ్నకు ధర్మరాజు సమాధానము చెప్పుచున్నాడు.

***అణోరణీయాన్ మహతో మహీయాన్***

"బ్రహ్మము అణువుకన్నా చిన్నది. మహత్తుకన్నా పెద్దది" అని ఉపనిషత్తు నిర్వచించుట చేత మహత్తు అనగా బ్రహ్మమని తెలియుచున్నది. అట్టి బ్రహ్మము తపస్సు ద్వారా పొందబడుచున్నది.

***విద్యా తపోభ్యాం పూతాత్మా***

"విద్యా తపస్సుల ద్వారా మానవుడు పవిత్రుడగుచున్నాడు".

మట్టినుండి స్వర్ణాన్ని వెలికి తీయడం విద్యఅయితే దానిని పుటం వేసి శుద్ధిచేయడం తపస్సనబడుచున్నది.

ముందు శ్రోత్రియత్వం రావాలి. తరువాత తపస్సు సాగాలి. విద్యలేని తపస్సు అనర్థాలకు దారితీస్తుంది.

***యస్య జ్ఞానమయం తపః***

"ఎవరి తపస్సు జ్ఞానమయమైనదో వారే బ్రహ్మమును పొందుతారు" అని ఉపనిషత్తు.

ఇచ్చట తపస్సును మననంగా భావించడం సముచితం.'**తప ఆలోచనేన**' 'ఆలోచనే తపస్సు' అని పాణినీ వ్యాకరణము లోని ధాతుపాఠము. నీలకంఠుల వారి భాష్యము కూడా ఈ విషయాన్నే ప్రస్తావించింది.

***శ్రుతస్య అర్థస్య ఆలోచనేన***

"వినిన విషయము యొక్క భావముపై ఆలోచనను సాగించుట" అని నీలకంఠ వ్యాఖ్య.

విద్యాతపస్సులచే బ్రహ్మము పొందబడుచున్నది. ఈ మహాకార్యములో సహకరించు రెండవవాడు ఎవడు? అనే మూడవ ప్రశ్నకు "ధృతి" అని జవాబిచ్చాడు ధర్మరాజు.

'ధృతి' అనగా ఇచ్చట నిదిధ్యాసన. మనస్సులో అచంచలమైన ఏకాగ్రతను కలిగి యుండుట వలన ఇంద్రియములకు గోచరించని విషయాలను గ్రహించుట జరుగుచున్నది. అదియే ధృతి.

***ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః***

***యోగేనావ్యభిచారిణ్యా ధృతిస్సా పార్థ సాత్త్వికీ ॥***

"మనస్సు, ప్రాణేంద్రియ వ్యాపారములను అచంచలమైన ఏకాగ్రతతో ఏ ధృతిచేత నిగ్రహించుట జరుగుచున్నదో ఆ ధృతిని సాత్త్వికధృతి అంటారు" అని శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత - మోక్షసన్న్యాస యోగములో తెలుపుతారు.

విద్యా తపస్సుల ద్వారా పునీతుడై తరించే మహితాత్మునికి తోడు నిలిచి రెండవ వాడుగా సహకరించేది ఈ ధృతియే. ఇదియే నిదిధ్యాసన లేక ధ్యానము.

***ఆత్మా వా అరే ద్రష్టవ్యః శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్యః***

"దర్శించదగినది ఆత్మ ఒక్కటియే. అట్టి ఆత్మయే శ్రవణము చేయదగినది. మననము చేయదగింది, ధ్యానము చేయదగింది కూడా ఆత్మయే నని బృహదారణ్యా కోపనిషత్తు ప్రవచించింది.

ఇక చివరగా, బుద్ధిమంతు డెవడు? అనే ప్రశ్నకు వృద్ధులను సేవించువాడు అని ధర్మరాజు సమాధాన మిచ్చాడు.

వృద్ధులనగా పెద్దవారని అర్థము. ఇచ్చట పెద్దవారంటే వయస్సులో పెద్దవారని కాదు. పెద్దది (బ్రహ్మ) అయిన విషయానికి సంబంధించిన జ్ఞానము కలవారని భావము. జ్ఞానవృద్ధులని అర్థము. వారే నేటి గురువులు. ఒకనాటి పూర్వాచార్యులు.

వయోవృద్ధులను కూడా సేవించాలి. కాని జ్ఞానవృద్ధులను సేవించడం అవశ్యంగా, తక్షణ కర్తవ్యంగా భావించాలి. గురువులను సేవించుట అనగా వారు శిష్యుల హృదయాలలో నిక్షిప్తం చేసిన సత్యజ్ఞానాన్ని ఇతరులకు అందించుట అనేది జాగ్రత్తగా గమనించదగిన కేంద్ర విషయము.

ఇచ్చట బుద్ధి అంటే లౌకిక జ్ఞానమని భావించకూడదు. ఇది ఉత్కృష్టమైన బుద్ధి. ప్రేయస్సును త్యజించి, శ్రేయస్సును ప్రేమించే బుద్ధి. కనుకనే కఠోపనిషత్తులో శ్రేయస్సునే వాంఛించిన నచికేతుని బుద్ధిమంతునిగా పేర్కొన్నారు.

**అహో బుద్ధిమత్తా తవ**

"ఓహో! ఎంతటి బుద్ధిమంతుడివి నీవు" అని యమధర్మరాజే నచికేతుని ప్రశంసించాడని శ్రీశంకరులు భాష్యంలో ప్రస్తావించారు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం బ్రాహ్మణానాం దేవత్వం కశ్చ ధర్మః సతామివ
కశ్చైషాం మానుషో భావః కిమేషా మసతా మివ । 3

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :- బ్రాహ్మణుల దైవలక్షణమెయ్యది? సత్పురుషుల వంటి లక్షణము వారిలో ఏమిటి? వారిలో సాధారణ మానవత్వమేమిటి? దుష్టుల వంటి లక్షణము వారిలో ఏమిటి?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ స్వాధ్యాయ ఏషాం దేవత్వం తప ఏషాం సతామివ
మరణం మానుషో భావః పరివాదోఽ సతామివ

**భావము :- స్వాధ్యాయమే బ్రాహ్మణులలో దైవలక్షణము. తపస్సే వారిలోని సత్పురుషుల లక్షణము. మరణమే మానవలక్షణము. నిందయే వారిలోని చెడ్డవారి లక్షణము.**

## వ్యాఖ్య

విప్రుల యందు వేదాధ్యయనమే దైవలక్షణము. అందుచేత వేదాధ్యయనము చేయువారిని విశాల హృదయంతో ఆర్షసంస్కృతి ఆరాధించింది. పవిత్రమైన వేదములను అధ్యయనము చేయువారిని దైవసమానులుగా గుర్తించింది. శ్రీకృష్ణ పరమాత్మ కూడా మహాభారతంలో ఈ విషయాన్ని ధృవపరచడం జరిగింది.

**దైవాధీనం జగత్సర్వం మంత్రాధీనం తు దైవతమ్**
**తే మన్త్రా బ్రాహ్మణాధీనా బ్రాహ్మణో మమ దైవతమ్!**

"ఈ విశ్వమంతా దైవాధీనంలో ఉంది. దైవము మంత్రాధీనము. అట్టి మంత్రాలు బ్రాహ్మణుని అధీనంలో ఉన్నాయి. కనుక బ్రాహ్మణుడు నా దైవము."

దీనిని బట్టి వేదాధ్యయన తత్పరుడికి ఎలాంటి స్థానము కల్పించబడిందో మనం ఊహించవచ్చును. ఇది విప్రునిలో దైవలక్షణము.

విప్రులయందు తపస్సే సత్పురుషుల లక్షణము. వేదాధ్యయనము వలన విప్రుడైనవాడు తపస్సు చేత బ్రాహ్మణుడగుచున్నాడు. సదాచార, శమదమాదులు కలిగియుండుటను తపస్సుగా వ్యాఖ్యానించారు నీలకంఠులవారు.

సదాచారము వలన దేహశుద్ధి, శమము వలన మనోనిగ్రహము దమము వలన ఇంద్రియ నిగ్రహము జరిగి మానవుడు పునీతుడగుచున్నాడు. ఇవి సత్పురుషుల లక్షణాలు.

మరణమే వారిలోని మానవ లక్షణమని మూడవ ప్రశ్నకు సమాధానం చెప్పాడు ధర్మరాజు.

దేహాత్మ భావంతో జీవించుటయే బ్రాహ్మణునకు మరణమని నీలకంఠుల వారు వ్యాఖ్యానిస్తూ, దేహాభిమానమే విప్రులయందు మానవ లక్షణమని చెప్పారు.

వేదాధ్యయన సమయంలో విప్రులలో దైవం గోచరించునట్లు, మరణించినపుడు వారియందు మానవలక్షణము చూచేవారికి గోచరిస్తుంది. తపస్సు ద్వారా బ్రహ్మ జ్ఞానమును పొందిన బ్రాహ్మణుని యందు దేహధ్యాసను గాంచలేము.

నిందయే వారిలోని దుష్ట లక్షణమని, ఈ శ్లోకంలోని నాల్గవ ప్రశ్నకు ధర్మరాజు సమాధానం చెప్పాడు. దైవాన్ని, దైవజ్ఞులను నిందించుట దుష్టలక్షణము. ఈ రెండు లక్షణాలు బ్రాహ్మణుని యందు ఉండదగనివి అన్నది నీలకంఠీయము.

నింద అనేది ఎక్కడ గోచరించినా అది దుష్టలక్షణమే. నిందలు బ్రాహ్మణుని నుండే కదలాలని లేదు. బ్రాహ్మణుని జూచి అసూయతో పరులు అతనిని నిందించుట కూడా కలదు. ఈ విధమైన నిందాలాపనకు తాను గౌణమే అయినా ప్రధానంగా తెలుస్తున్నాడు. నిష్కారణంగా ఈ దుష్ట లక్షణానికి తాను కారణంగా తెలుస్తున్నాడు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం క్షత్రియాణాం దేవత్వం కశ్చ ధర్మః సతామివ
క్శ్చైషాం మానుషో భావః కిమేషా మసతా మివ ।　　4

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :-** క్షత్రియులలో దైవలక్షణమేమి? వారిలో సత్పురుషుల లక్షణమేది? వారిలో మానవ స్వభావ మేమిటి? వారిలో దుష్ట లక్షణమేమి?

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ ఇష్వస్త్ర మేషాం దేవత్వం యజ్ఞ ఏషాం సతామివ
భయం వై మానుషోభావః పరిత్యాగోఽ సతామివ

**భావము :- ధనుర్విద్య క్షత్రియులలో దైవలక్షణము. యజ్ఞము వారిలో సత్పురుష లక్షణము. భయము వారిలో మానవలక్షణము. ఆర్తులను పరిత్యజించుట వారిలో చెడు లక్షణము.**

## వ్యాఖ్య

స్వాధ్యాయము బ్రాహ్మణులలో దైవలక్షణమైనట్లు ధనుర్విద్య క్షత్రియులలో దైవలక్షణము. స్వాధ్యాయము వలన బ్రాహ్మణుడు తేజోవంతుడైనట్లు ధనుర్విద్య వలన క్షత్రియుడు తేజోవంతుడవుతాడు.

ధనుర్విద్యా నిపుణుడైన క్షత్రియుడు ప్రజలను శత్రువుల నుండి కాపాడుతాడు. అంతమాత్రాన సమాజంలో అభ్యుదయము రాదు. సమాజకళ్యాణానికి యజ్ఞయాగాదులు కూడా నిర్వహిస్తాడు. ఇది క్షత్రియుని యందు సత్పురుష లక్షణము అంటున్నాడు. ధర్మరాజు.

భయము అనేది క్షత్రియునిలోని మానవస్వభావము. రాజ్యనష్టాన్ని గూర్చి, కరువు కాటకాలను గూర్చి రాజు భయపడుతూ ఉంటాడు. ఇది క్షత్రియుని లోని మానవస్వభావము.

ఆర్తులైన ప్రజలను ఆదుకోక పోవడము క్షత్రియుని లోని దుష్టలక్షణము అని నాల్గవ ప్రశ్నకు ధర్మరాజు సమాధాన మిచ్చాడు.

***క్షతాత్కిల త్రాయతే ఇత్యుదగ్రః క్షత్రస్య శబ్దో భువనేషు రూఢః***

"ఇతరులను గాయాలనుండి రక్షించువాడు క్షత్రియుడు" అని కాళిదాస మహాకవి రఘువంశములో తెలిపాడు.

ప్రజల దేహాలకే గాక మనసులకు కూడా గాయాలు తగలకుండా చూడవలసిన బాధ్యత క్షత్రియునిపై ఉంది. అట్టి విద్యుక్తధర్మాన్ని త్యజించడము క్షత్రియుని లోని చెడు లక్షణము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ కిమేకం యజ్ఞియం సామ కిమేకం యజ్ఞియం యజుః**
**కా చైషాం వృణుతే యజ్ఞం కాం యజ్ఞో నాతివర్తతే ॥ 5**

**యక్షుడు అడిగెను :-**

**భావము :- యజ్ఞమునకు ఉపకరించు ఒక సామమేది? యజ్ఞమునకు ఉపకరించు ఒక యజస్సు ఏది? వీనిలో ఏది యజ్ఞమును కాంక్షించును? యజ్ఞము దేనిని అతిక్రమించదు?**

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ ప్రాణో వై యజ్ఞియం సామ మనో వై యజ్ఞియం యజుః
ఋగే కా వృణుతే యజ్ఞం తాం యజ్ఞో నాతివర్తతే ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- యజ్ఞోపయోగమైన సామము ప్రాణము. యజ్ఞమున కుపకరించు యజుస్సు. మనస్సే. యజ్ఞమును కాంక్షించునది ఋక్కు ఒక్కటియే. యజ్ఞము ఋక్కును అతిక్రమించదు.

## వ్యాఖ్య

యజ్ఞమునందు ఋగ్యజుస్సామ వేదములు ప్రధానములుగా ఉంటాయి. యజ్ఞములలో హోత, అధ్వర్యు, ఉద్గత అనెడి నామములతో ఋత్విక్కులు మూడు విధాలుగా తెలుస్తూ ఉంటారు.

యజ్ఞాలలో దేవతల నారాధిస్తూ ఋగ్వేద మంత్రాలను పలుకువాడు హోత. యజ్ఞములో హోమాది కార్యాలను నిర్వహిస్తూ యజుర్వేద బ్రాహ్మణ మంత్రాలను ఉచ్చరించువాడు అధ్వర్యు నామధేయుడై ఉన్నాడు. దేవతలను స్తుతిస్తూ సామవేద మంత్రాలను ఉచ్చరించువాడు ఉద్గత నామంతో తెలియుచున్నాడు. యజ్ఞ నిర్వహణకు వీరు ముగ్గురూ అవసరము.

ఇది బాహ్యంలో ఆచరించబడే యజ్ఞకార్యము. ఆంతర్యంలో ఆచరించబడే యజ్ఞమును ఉపనిషత్ ప్రతిపాదించింది. అదియే జ్ఞానయజ్ఞము.

*త్రయో వేదా ఏత ఏవ వాగేవర్గ్వేదో మనో యజుర్వేదః ప్రాణః సామవేదః*

ఉపాసకుడు ఋక్కును వాక్కుగా, యజుస్సును మనస్సుగా, సామమును ప్రాణంగా భావించి చింతన సాగించవలెనని బృహదారణ్యకోపనిషత్తు ఆదేశించింది.

ఋక్సామములు వాక్ప్రాణములుగా తెలుస్తున్నాయి. ఋక్కు వాగ్రూపము కాగా సామము ప్రాణముగా తెలియుచున్నది.

*స్వరాత్మకత్వాత్ సామ్న*

సామవేదము స్వరముతో కూడినది. స్వరము ప్రాణముపై ఆధారపడి యున్నందున సామము ప్రాణరూపంగా భావించడం జరిగింది.

జ్ఞానయజ్ఞము నందు వాక్ప్రాణములను నిరోధించాలి. ఆ తరువాత యజుస్సు అనే మనస్సు నిగ్రహింపబడుతుంది.

***ప్రాణబంధనాత్ లీయతే మనః***

***జాలపక్షివత్ రోధ సాధనం***

"ప్రాణ బంధనము వలన వలలో చిక్కిన పక్షిలాగా మనసు కదలదు. మనసును నిరోధించుటకు ఇది చక్కని సాధనము" అన్నారు భగవాన్ రమణమహర్షి.

వాక్ప్రాణములు పరస్పరాధీనములు. వీటిని నిగ్రహిస్తే మనోనిగ్రహము సులభమవుతుంది. ఈ విధంగా వాక్ప్రాణ మనస్సులు నిరోధింపబడగానే అంతఃకరణ శుద్ధిపడి గురుబోధను గ్రహించుటకు సిద్ధపడుతుంది.

ఈ విధమైన యజ్ఞము ఋక్కును అతిక్రమించదు అని నాల్గవ ప్రశ్నకు సమాధాన మిచ్చాడు ధర్మరాజు. గురువు అందించే జ్ఞానమును అతిక్రమించిన జ్ఞానము మరొకటుండదని భావము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం స్వి దావపతాం శ్రేష్ఠం కిం స్వి న్నివపతాం వరమ్
కిం స్విత్ ప్రతిష్ఠమానానాం కిం స్విత్ ప్రసవతాం వరమ్ ॥ 6

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :-** **క్రిందపడువానిలో శ్రేష్ఠమైనది ఏది? భూమిలో నుంచు వానిలో శ్రేష్ఠమైనది ఏది? చతుష్పాద జంతువులలో శ్రేష్ఠమైనది ఏది? సంతాన కాంక్షితులకు ఏది శ్రేష్ఠము?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ వర్ష మావపతాం శ్రేష్ఠం బీజం నివపతాం వరమ్
గావః ప్రతిష్ఠమానానాం పుత్రః ప్రసవతాం వరమ్

**భావము :-** **పతనమయ్యే వానిలో వర్షము శ్రేష్ఠము. భూమిలో ప్రవేశించు వానిలో బీజము శ్రేష్ఠము. చతుష్పాద జంతువులలో గోవులు శ్రేష్ఠము. సంతానము కోరువారికి పుత్రుడు శ్రేష్ఠము.**

## వ్యాఖ్య

తాను క్రిందపడి మొక్కలను పైకి పంపే వర్షము పరోపకార వైభవముతో శోభిస్తున్నందున సర్వప్రాణులను తృప్తిపరచే వర్షము శ్రేష్ఠమని చెప్పబడింది.

తాను నశించినా, ఫలపుష్పాదుల నందించే వృక్షాన్ని ప్రసాదించే బీజము శ్రేష్ఠమై మిగిలింది.

"ప్రతిష్ఠ మానానాం" అనగా చతుష్పాద జంతువులని అవగతం చేసుకోవాలి. అట్టివానిలో గ్రాసము తిని క్షీరమునిచ్చే గోమాత శ్రేష్ఠమైనది.

గోమాత వలె ప్రత్యక్షముగా ఉపయోగపడువాడు పుత్రుడు. వధువుగా వెళ్ళే వనితకన్నా, వరుడుగా వెంట నుండువాడే వరమైనవాడు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ ఇంద్రియార్థా నమభవన్ బుద్ధిమాన్ లోక పూజితః
సంమతః సర్వభూతానా ముచ్ఛ్వసన్ కో న జీవతి । 7

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :- ఇంద్రియ విషయాలను అనుభవించుచు, బుద్ధిమంతుడై, లోకపూజితుడగుచు, సర్వప్రాణులకు ఇష్టుడు అగుచు జీవించుచుండినను, జీవించని వాడెవడు?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ దేవాతాతిథి భృత్యానాం పిత్రాణా మాత్మనశ్చయః
న నిర్వపతి పంచానా ముచ్ఛ్వసన్ న స జీవతి ॥

**ధర్మరాజు పలికెను :-**

**భావము :- దేవతలకు, అతిథులకు, సేవకులకు, పితృదేవతలకు, తనకు తృప్తినిచ్చు యజ్ఞములను చేయనివాడు జీవించినా మరణించినవాడే అగుచున్నాడు.**

## వ్యాఖ్య

మానవుడు ప్రతిదినము పైన పేర్కొనబడిన పంచ మహాయజ్ఞాలను తప్పక ఆచరించాలి. అవి (1) దేవయజ్ఞము :- దేవతలనుపాసించుట (2) అతిథి యజ్ఞము :- గృహాని కరుదెంచు అతిథిని సత్కరించుట (3) భృత్యుయజ్ఞము :- మనపై ఆధారపడి జీవించు సేవకులను రక్షించుట (4) పితృయజ్ఞము :- పూర్వీకులకు శ్రాద్ధ తర్పణ కర్మలాచరించుట (5) ఆత్మయజ్ఞము :- తన ఆత్మను ఉద్ధరించుకొనుట. ఈ విధమైన పంచమహాయజ్ఞాలను ప్రతి గృహస్థుడు నిర్వహించాలి. అలా ఆచరించనివాడు బ్రతికియున్నా చచ్చినవాడేనని ఊహించి యక్షుడు ప్రశ్నించాడు. దానినే ఖాయపరుస్తూ ధర్మరాజు సమాధానమిచ్చాడు.

అయితే బుద్ధిమంతుడు, లోకపూజితుడు, సర్వసమ్మతుడు అని అట్టివానిని ఎందుకు అనవలసి వచ్చింది?

సంపద కలిగియున్న వానిని లోకము గౌరవిస్తుంది. సంపద ఉంది కనుక నిజానికో, పేరు కొరకో నాలుగు మంచిపనులు చేసి సర్వులకు మంచివాడుగా

మిగలవచ్చు. ఈ మాత్రం తెలివి ఉన్నందున బుద్ధిమంతుడుగా చెలామణి కావచ్చు. కానీ, ఈ విధంగా లోకంలో గుర్తింపు పొందినా ఎవడయితే నిత్యానుష్ఠానములైన పంచ మహాయజ్ఞాలను నిర్వహించడో వాడు జీవించినను మరణించినవాడే అగుచున్నాడు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ కిం స్వి ద్గురుతరం భూమేః కిం స్వి దుచ్చతరం చ ఖాత్**
**కిం స్వి చ్ఛీఘ్రతరం వాయోః కిం స్వి ద్బహుతరం తృణాత్ ॥ 8**

**యక్షుడు పలికెను :-**

**భావము :- భూమికంటే గొప్పదైనది ఏది? ఆకాశం కంటె ఎత్తైనది ఏది? గాలికంటే వేగము కలది ఏది? గడ్డికంటె నీచమైనది ఏది?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

**శ్లో॥ మాతా గురుతరా భూమేః ఖాత్ పితోచ్చతర స్తథా**
**మనః శీఘ్రతరం వాతా చ్చిన్తా బహుతరీ తృణాత్ ॥**

**యుధిష్ఠిరుడు చెప్పుచున్నాడు :-**

**భావము :- భూమికంటె గొప్పదైనది తల్లి. ఆకాశము కంటె ఉన్నతుడు తండ్రి. గాలికంటె వేగముకలది మనస్సు. గడ్డికంటె నీచమైనది చింత.**

## వ్యాఖ్య

ఈ శ్లోకంలోని నాలుగు విషయాలలో మొదటి రెండు మనం ఆచరించవలసినవి. చివరి రెండు త్యజించవలసినవి. కృత్యాకృత్యములను ఇక్కడ తెలుపుట జరిగింది.

పుడమితల్లికన్నా పుట్టుక నిచ్చిన తల్లిని, వర్షించే నింగికన్నా మనపై వాత్సల్యాన్ని వర్షించే తండ్రిని ఉన్నతులుగా భావించి సేవచేయాలి. మాతాపిత సేవలో మాధవసేవ దాగి ఉందని గ్రహించాలి.

ఇకపోతే (1) గాలికన్నా చంచలమైన మనస్సును విషయాలపైకి వెళ్లనీకుండా గమనించుట (2) దుఃఖాన్ని దగ్గరకు రానివ్వకుండుట.

మనసు చంచలమైనది. చపలమైనది. ఒకచోట ఉండదు. ఒక విషయముపై నిలకడగా ఉండదు. సదా చంచలత్వమే. మనస్సును నిగ్రహించుట అనునది గాలిని గుప్పిట్లో బంధించుట వంటిది.

***చంచలం హి మనః కృష్ణ ప్రమాథి బలవ ద్దృఢమ్***

***తస్యాఽహం నిగ్రహం మన్యే వాయోరివ సుదుష్కరమ్ ॥***

"కృష్ణా! మోహమును కలిగించే ఈ మనస్సు చంచలమై, బలవంతమై, దృఢమై ఉన్నది. దీనిని నిగ్రహించుట గాలిని బంధించునట్లు దుస్సాధ్యమని నాకు తోచుచున్నది" అని భగవద్గీత - 6వ అధ్యాయములో అర్జునుడు శ్రీకృష్ణునితో విన్నవించుకున్నాడు.

ఈ విషయము నిస్సంశయమని పరమాత్మ పలుకుచూ అట్టి మనసును అభ్యాస వైరాగ్యముల ద్వారా నిగ్రహించమని తెలిపాడు.

విహరించడం లేదా విలపించడం ఈ రెండే తెలుసు మనసుకి. మనసును ఈ రెండింటి నుండి మరలించువాడే సాధకుడు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం స్విత్ సుప్తం న నిమిషతి కిం స్విజ్జాతం న చోపతి
కస్య స్విద్ధృదయం నాస్తి కిం స్విద్వేగేన వర్ధతే ॥ 9

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :-** నిద్రించునపుడు కన్ను మూయనిది ఏది? పుట్టిన తరువాత కదలనిది ఏది? హృదయం లేని దేది? తన వేగముతో వృద్ధి పొందునది ఏది?

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ మత్స్యః సుప్తో న నిమిష త్యణ్డం జాతం న చోపతి
అశ్మనో హృదయం నాస్తి నదీ వేగేన వర్ధతే ॥

**యుధిష్ఠిరుడు చెప్పెను :-**

**భావము :-** కన్ను మూయకుండా నిద్రించునది చేప. పుట్టిన తరువాత కదలనిది గ్రుడ్డు. హృదయము లేనిది రాయి. తన వేగముతోనే వృద్ధి పొందునది నది.

## వ్యాఖ్య

కళ్ళు తెరచుకొని నిద్రించునది చేప. ఇచ్చట జీవుడు చేపతో పోల్చబడినాడు. కళ్ళు తెరచుకొని యుండుట జాగ్రదవస్థ. నిద్రించుట స్వప్నావస్థ.

చేప నదిలో ఉభయతీరముల మధ్య చరించునట్లు జీవుడు జాగ్రత్స్వప్నాల మధ్య పరుగులిడుచు, మార్గంలో ఈ రెండూ చేరలేని సుషుప్తిలో లయించును. సుషుప్తిలో జీవుడు లేకపోలేదు. కానీ ఉన్నట్లు తెలియడం లేదు. చేప కన్ను తెరచి నిద్రించినట్లే ఉన్నది. చూస్తున్నట్లే ఉన్నది. చూడకనే యున్నది. ఈ విషయాన్ని ఉపనిషత్ కూడా ధృవపరుస్తుంది.

***తద్యథా మహామత్స్య ఉభే కూలేఽను సంచరతి పూర్వం చాపరం చ!***

***ఏవమేవాయం పురుష ఏతావుభావన్తావను సంచరతి స్వప్నాన్తం చ బుద్ధాన్తంచ!***

"గొప్పదైన చేప ఉభయ తీరములను అనుసరించి తిరుగుచున్నది. ఈ విధముగనే పురుషుడు జాగ్రత్స్వప్న స్థానములను అనుసరించి తిరుగుచున్నాడు" అని బృహదారణ్యకోపనిషత్తు.

అవస్థాత్రయము నడుస్తున్నా పురుషుడు అవస్థాత్రయానికి సాక్షియే గాని అవస్థలలో చరించువాడు కాడు. చరించుచున్నట్లు గోచరించినా వాస్తవానికి తాను అచలరూపుడే. పుట్టినా కదలని అండము వంటివాడే.

***తదేజతి తన్నైజతి***

"ఆత్మ చలించును. వాస్తవానికి చలించదు" అని ఈశావాస్యోపనిషత్తు. ఇది ఆత్మ లక్షణము కనుక ఆత్మవిదుడైన వాడు కూడా చేస్తున్నా చేయనివాడుగానే భావిస్తున్నాడు.

***నైవ కించి త్కరోమీతి యుక్తో మన్యేత తత్త్వవిత్***

"తత్త్వము నెరిగిన యోగయుక్తుడు తాను సర్వకర్మములు చేయుచున్నను ఏమియు చేయుట లేదని భావించుచున్నాడు" అని భగవద్గీతా ప్రబోధము.

తత్త్వవిదుని హృదయము శోకమోహాదులకు, సుఖసంతోషాలకు అతీతంగా ఉండుటచేత ఆ మహితాత్ముడు జాతి హృదయం కలవాడుగా తెలియుచున్నాడు అని ధర్మరాజు మూడవ ప్రశ్నకు సమాధాన మిచ్చాడు.

తత్త్వవిదుడు జాగ్రత్స్వప్న సుషుప్తులలో చరిస్తూ ఉండినా తాను ఆత్మయే ననెడి ఎరుకను కలిగియే యున్నాడు. ఈ ఎరుక అఖండముగనే సాగుచున్నది. ఇది వర్షపు నీటిలా కాకుండా నదీ ప్రవాహంలా సాగుచున్నది. అదియే నదిలా వృద్ధి చెందుతున్న ఆత్మ పొంగు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం స్విత్ ప్రవసతో మిత్రం కిం స్విన్మిత్రం గృహే సతః
ఆతురస్య చ కిం మిత్రం కిం స్విన్మిత్రం మరిష్యతః ॥ 10

**యక్షుడు అడిగెను :-**

**భావము :- ప్రయాణము చేయువానికి మిత్రుడెవరు? ఇంటనున్నవానికి నేస్తమెవరు? రోగికి స్నేహితుడెవరు? చచ్చే వానికి చెలికాడెవరు?**

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ పార్థః ప్రవసతో మిత్రం భార్యామిత్రం గృహే సతః
ఆతురస్య భిషఙ్మిత్రం దానం మిత్రం మరిష్యతః

ధర్మరాజు చెప్పుచున్నాడు :-

భావము :- ప్రయాణము చేయువానికి యాత్రికుల సమూహమే నేస్తము. ఇంటనున్నవానికి భార్యే మిత్రుడు. రోగికి వైద్యుడు మిత్రుడు, దాటిపోయేవానికి దానమే మిత్రుడు.

## వ్యాఖ్య

కలిసి ప్రయాణము చేయువారితో సఖ్యత కలిగి యుండాలి. అప్పుడే ప్రయాణం సుగమమవుతుంది. గృహస్థాశ్రమంలో భార్య మిత్రురాలైతేనే భర్త చరిత్ర సుఖాంతమవుతుంది. వైద్యుడు రోగికి నారాయణుడు కావాలి కానీ యముడు కాకూడదు. ఈ సందర్భంలో ఒక శ్లోకం జ్ఞాపకమొస్తోంది.

*వైద్యరాజ నమస్తుభ్యం త్వం యమరాజ సహోదరః*

*యమః హరతి ప్రాణాని త్వం ప్రాణాని ధనానిచ*

"అయ్యా! భిషగ్వరా! నమస్కారం. తమరు యమధర్మరాజుకు సహోదరులు. యముడు ప్రాణము మాత్రమే హరిస్తాడు. తమరు ప్రాణమూ, ధనమూను".

జీవితాన్ని దాటి వెళ్ళేవానికి దానమే మిత్రుడు. ఈ లోకంలో చేసిన సత్కార్యములు, సత్పాత్రదానములే పైలోకాల్లో దారిబత్తెము అవుతాయి. ప్రతి ఒక్కరు దానగుణమును ప్రధానముగా అలవరచుకోవాలి.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ కోఽతిథిః సర్వభూతానాం కిం స్విద్ధర్మం సనాతనమ్
అమృతం కింస్విద్రాజేంద్ర కిం స్విత్ సర్వమిదం జగత్ ॥ 11

యక్షుడు ప్రశ్నించెను :-

భావము :- రాజేంద్రా! సర్వజీవులకు అతిథి ఎవరు? సనాతన ధర్మమేది? అమృతమనగానేమి? ఈ సమస్త ప్రపంచము ఏమి?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ అతిథిః సర్వభూతానా మగ్నిః సోమో గవామృతమ్
సనాతనోఽమృతో ధర్మో వాయుః సర్వమిదం జగత్

**యుధిష్ఠిరుడు చెప్పెను :-**

**భావము :- సర్వజీవులకు అతిథి అగ్ని, సోమము, గోక్షీరము అమృతము. అమృతమయమైనది సనాతన ధర్మము. వాయువే ఈ సమస్త ప్రపంచము.**

## వ్యాఖ్య

అతిధివలె అగ్ని అర్చనీయమైనది. ఘృతము, గోక్షీరము మున్నగునవి అగ్నికి సమర్పించడము వలన ఏర్పడే ధూమము మేఘాలను కరిగించి, వర్షమునకు కారణమగుచున్నది. వర్షము వలన జీవులకు ఆహారము, సస్యము లభ్యమగుచున్నది. అందుచేత అగ్ని అతిధి వలె ఆరాధ్యమైనది.

మనము అర్పించే ఆహారమును అతిధి ఆరగించునట్లు మనము ఏది సమర్పించినా అగ్ని అదృశ్యం చేయుట చేత కూడా అగ్నిని అతిధిగా భావించడమైంది.

గోక్షీరము, సోమరసము అమృతము వంటివి. నిత్యమై మృతము కానిదేదో అదియే సనాతన ధర్మము. ఇక్కడ రెండు, మూడు ప్రశ్నల సమాధానములు ముందు వెనుకలుగా తెలుస్తున్నాయి. గ్రహించగలరు.

ఈ ప్రపంచమంతా వాయువు పరివ్యాప్తమై ఉండుట చేత ఈ ప్రపంచమంతా వాయువే అని ధర్మరాజు సమాధానము చెప్పాడు.

***వాయురేవ వ్యష్టిః వాయురేవ సమిష్టిః***

"పిండాండము వాయువే. బ్రహ్మాండము వాయువే" అనెడి వేదమంత్రాన్ని నీలకంఠులు ఈ సందర్భమున ఉటంకించారు.

***నమస్తే వాయో! త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి***

"ఓ వాయువా! నీకు నమస్కారము. ప్రత్యక్షముగా గోచరించు బ్రహ్మవివి నీవే" అని ఉపనిషత్తు కూడా పలికింది.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం స్వి దేకో విచరతే జాతః కో జాయతే పునః
కిం స్వి ద్ధిమస్య భైషజ్యం కింస్వి దావపనం మహత్ ॥ 12

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :- ఒంటరిగా సంచరించు వాడెవడు? మరల పుట్టునది ఏది? మంచుకు మందు ఏది? గొప్ప ఆధారమైనది ఏది?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

**శ్లో॥ సూర్య ఏకో విచరతే చంద్రమా జాయతే పునః**
**అగ్ని ర్హిమస్య భైషజ్యం భూమి రావపనం మహత్ ॥**

**ధర్మరాజు చెప్పెను :-**

**భావము :- ఒంటరిగా సంచరించువాడు సూర్యుడు. మరల పుట్టేవాడు చంద్రుడు. మంచుకు మందు అగ్నే. గొప్పదైన ఆధారము భూమి.**

## వ్యాఖ్య

ఈ ప్రపంచమంతా వాయువే అని గడచిన శ్లోకంలో చెప్పడం జరిగింది. వాయువు చలనాత్మకము. ఈ ప్రపంచము కూడా మార్పుచెందే స్వభావము కలిగింది కనుక పరిణామశీలమైన ఈ జగత్తు కూడా చలనాత్మకమే. చలనము ద్వైతము. చలనానికి ఆధారమైనది అచలమై ఉండాలి. అట్టిది ఏకమే గాని అనేకము అయ్యేందుకు వీలులేదు.

కనుక సూర్యుడు ఒంటరిగా పయనిస్తున్నాడు. సూర్యుడు వాస్తవానికి పయనించడమే లేదు. పయనమైనట్లు గోచరిస్తున్నాడు. అతడు ఎప్పుడూ ఏకమే. అచలమే.

***హృదాకాశే చిదాదిత్యః సదా భాసతి భాసతి***

***నాస్తమేతి న చోదేతి కథం సంధ్యా ముపాస్మహే ॥***

"హృదయాకాశమున జ్ఞాన సూర్యుడు సదా ప్రకాశించుచునే యున్నాడు. అతడు అస్తమించుటలేదు. ఉదయించుటయూ లేదు. ఇక సంధ్యవార్చే దెలాగు?" అంటూ నిజమైన సంధ్యలో నిలబడి వందన మాచరించింది మైత్రేయోపనిషత్తు.

కనుక సూర్యుడు అంటే జ్ఞానసూర్యుడు అని భావము. జ్ఞానసూర్యుడు అంటేనే ద్వైత చీకటికి దూరుడని అర్థము. రెండు తెలియని వాడని భావము. కనుక అతనిది సదా ఏకాంతమే.

ఇక్కడ ఏకాంతము లేదా ఏకాంతంలో ప్రయాణము అంటే దేశకాలాదులని ఊహించుకొని అర్థం చేసుకోకూడదు. రెండవ వస్తువు లేనేలేదు అనెడి నిశ్చయముతో ఉండుటయే ఏకాంతము. ఈ విషయాన్ని ఉపనిషత్ అద్భుతంగా ప్రవచించింది.

***ఏకమేద్వితీయం య ద్గురో ర్వాక్యేన నిశ్చితమ్***

***ఏత దేకాన్త మిత్యుక్తం న మఠం న వనాన్తరమ్***

గురుబోధచే "అద్వయ పరబ్రహ్మము ఒక్కటియే" అనెడి నిశ్చయ జ్ఞానమే ఏకాంతముగాని, మఠము, వనాంతరము ఏకాంతములు కావు.

మరి ఉన్నది ఒక్కటే అయినపుడు ఈ ప్రపంచం మరల ఎలా పుట్టింది? అనే రెండవ ప్రశ్నకు సమాధానముగా మరల పుట్టేవాడు చంద్రుడు అని సమాధాన మిచ్చాడు ధర్మరాజు.

### *మనసో చంద్రమా*

మనసుకు అధిష్ఠానదేవత చంద్రుడు. కనుక ఈ ప్రపంచము మనోజాతమని అర్థము. అజ్ఞాన జనితమని భావము. సమస్త దు:ఖాలకు మనసే కారణంగా తెలుస్తోంది.

మరి ఈ అవిద్య ఎలా నశించాలి? అజ్ఞానమేఘము తొలగినపుడే జ్ఞాన సూర్యుని దర్శనమవుతుంది. ఈ ప్రశ్నకు సమాధానమే మంచుకు అగ్నియే మందు అని ధర్మరాజు చెప్పడము.

అగ్ని యొక్క వేడికి మంచు కరిగిపోవునట్లు జ్ఞానాగ్నికి అజ్ఞాన మంచు అదృశ్యమవుతుంది.

దీనికంతటికి గొప్ప ఆధారము భూమి అని నాల్గవ ప్రశ్నకు ధర్మరాజు జవాబు పలికాడు.

భూమి అంటే మట్టి. ఆ మట్టితో తయారైనదియే దేహము. సమస్తానికి భూమి ఎలా ఆధారమో సదసత్తులకు ఆధారమైనది శరీరమే. అజ్ఞానానికి ఇదే నిలయము. జ్ఞానాన్ని పొందితే అదే ఆలయము. అన్నిటికీ ఆలంబనము, ఆధారము తానై మానవ క్షేత్రము ధర్మక్షేత్రమైంది.

క్షేత్రము అంటే పొలము అని కూడా అర్థము. మనం ఏ విత్తనములను పొలములో నాటుతామో అవే మొలకెత్తుతాయి. ఈ దేహము ద్వారా ఏ కర్మ లాచరిస్తామో ఆ ఫలితాలే అందుతాయి. వాటికి అనుగుణమైన జన్మలే కలుగుతాయి. కనుక సర్వాధారమైనది దేహముగానే తెలియుచున్నది. భూమిని సర్వాధారముగా ధర్మరాజు ఉదహరించుటలోని అంతరార్థమిదియే.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ కిం స్విదేకపదం ధర్మ్యం కిం స్విదేకపదం యశః**
**కిం స్విదేకపదం స్వర్గ్యం కిం స్విదేకపదం సుఖమ్ ॥ 13**

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :-** ధర్మమునుండి విడిపడనిది ఏది? ఏకమైన యశస్సు ఏది? ఒక్క మాటగా స్వర్గమునకు చేర్చునది ఏది? సమస్త సుఖము దేని యందున్నది?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ దాక్ష్య మేకపదం ధర్మ్యం దాన మేకపదం యశః
సత్య మేకపదం స్వర్గ్యం శీల మేకపదం సుఖమ్ ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- దక్షతయే ఉత్కృష్టమైన ధర్మము. దానమే ఉన్నతమైన కీర్తి. సత్యమే పరమస్వర్గము. శీలమే ఉత్తమ సుఖము.

## వ్యాఖ్య

సర్వకార్యములను దీక్షతో నిర్వర్తించుటయే దక్షత. దక్షత గలవాడు దక్షుడు. ఆధ్యాత్మిక మార్గంలో చరించువాడు దక్షుడై ఉండాలి. అనపేక్షఃశుచిఃదక్ష అని భగవద్గీత భక్తుని లక్షణాలలో దక్షతను కూడా చేర్చింది.

ఈ ప్రపంచానికి మనము ఏమీ తీసికొని రాలేదు. మనం పొందియున్నదంతా ఇక్కడ లభించిందే. పోయేనాడు ఏదీ పట్టుకపోలేము. ఇక్కడ పొందిన దానిని ఇక్కడే విడిచిపెడుతున్నాం. ఈ సత్యాన్ని గ్రహించి తృప్తితో ఆచరించే దానాలు వ్యక్తికి దివ్యమైన కీర్తిని తెచ్చిపెడతాయి.

సత్యానికి మించిన స్వర్గము, శీలానికి మించిన సుఖము ఎక్కడా గోచరించవు. ఆధ్యాత్మిక సాధకుడు సత్యవంతుడై ఉండాలి. శీలవంతుడై ఉండాలి.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ కిం స్వి దాత్మా మనుష్యస్య కిం స్వి ద్దైవకృతః సఖా
ఉపజీవనం కింస్వి దస్య కింస్వి దస్య పరాయణమ్ 14

యక్షుడు ప్రశ్నించెను :-

భావము :- మనుష్యునికి ఆత్మ ఏది? మనిషికి దైవమిచ్చిన మిత్రుడెవరు? దేనిపై ఆధారపడి అతడు జీవించును? అతని పరమ గమ్యమేది?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ పుత్ర ఆత్మా మనుష్యస్య భార్యా దైవకృతః సఖా
ఉపజీవనం చ పర్జన్యో దాన మస్య పరాయణమ్ ।

ధర్మరాజు చెప్పెను :-

భావము :- మనుష్యునికి ఆత్మ కుమారుడు. భార్య భగవానుడొసగిన మిత్రుడు. మేఘమే జీవనాధారము. దానమే ఉత్కృష్టమైన గతి.

## వ్యాఖ్య

పుత్రుడుగా జన్మించినది తన శక్తియే కనుక తనకు ఆత్మ పుత్రుడే అని వేదము భాషించింది. **(ఆత్మావై పుత్రనామసి)**

స్నేహితుల్ని మనం ప్రయత్నపూర్వకంగా పొందుతాము. కానీ భార్య భగవంతుడిచ్చిన మిత్రుడు. అందుచేత మిత్రులందరి కన్నా భార్య నెక్కువగా సుఖపెట్టాలి. గౌరవించాలి.

ఆహారము వర్షమువల్ల లభిస్తుంది. అట్టి వర్షాన్ని ప్రసాదించేది మేఘము కనుక మనుష్యునికి జీవనాధారము మేఘము.

పరమాత్మ మనకు ప్రసాదించిన దానిని పరమాత్మ సంతానముతో కలిసి పంచుకోవడము, కలిసి అనుభవించడమే దానము. అందుచేత దానము పరమో ...ృష్టముగా కీర్తించబడింది.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ ధన్యానా ముత్తమం కింస్విద్ ధనానాం స్యాత్ కిముత్తమమ్
లాభానా ముత్తమం కిం స్యాత్ సుఖానాం స్యాత్ కిముత్తమమ్ ॥ 15

**యక్షుడు ప్రశ్నించెను :-**

**భావము :- ధన్యములలో ఉత్తమమేది? ధనములలో ఏది శ్రేష్ఠము? లాభాలలో ఏది ఉత్కృష్టము? సుఖాలలో ఏది ఉన్నతము?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ ధన్యానా ముత్తమం దాక్ష్యం ధనానా ముత్తమం శ్రుతమ్
లాభానాం శ్రేయ ఆరోగ్యం సుఖానాం తుష్టిరుత్తమా

**ధర్మరాజు పలికెను :-**

**భావము :- ధన్యములలో దాక్ష్యము గొప్పది. ఉత్తమమైన ధనము చదువు. లాభాలన్నిటిలోకి శ్రేష్ఠమైనది ఆరోగ్యము. సుఖాలలో ఉత్తమమైనది సంతృప్తి.**

## వ్యాఖ్య

దక్షత కలిగి యుండుటయే దాక్ష్యము అని గడచిన శ్లోకములో గ్రహించాము. దక్షులైన వారి జన్మ ధన్యము. ప్రతికార్యమును దక్షతతో నిర్వహించి కృత కృత్యులగుట వలన దక్షులు ధన్యులౌతున్నారు.

తరగని ధనము, కరగని ధనము జ్ఞానమే. ధనమే మెరుగని అజ్ఞాన దశలో భావించినా అది ఆకాశంలో క్షణప్రాయంగా తెలిసే మెరుపులాంటిదే అనేది సత్యము. ఏనాడైనా చెడని ధనము జ్ఞానమే.

లాభాలలో ఉత్తమ లాభము ఆరోగ్యము. ఆరోగ్యమే సమస్త లాభాలకు ఆధారంగా తెలియుచున్నందున దానిని ఉత్తమ లాభంగా చెప్పడం జరిగింది.

జీవితంలో ఎన్ని పొందినా తృప్తి లేనిచో శాంతి మిగలదు. తృప్తిలేని సుఖాల వెంట పరుగులెత్తి అసంతృప్తితో అలమటించుటకన్నా సంతృప్తియే నిజమైన సుఖమని, ఉత్తమ సుఖమని గ్రహించి జీవించువారి శాంతిని ఎవ్వరూ భగ్నం చేయలేరు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కశ్చ ధర్మః పరో లోకే కశ్చ ధర్మః సదాఫలః
కిం నియమ్య న శోచన్తి కైశ్చ సంధి ర్న జీర్యతే ॥ 16

**యక్షుడు పలికెను :-**

**భావము :- లోకంలో ఉత్తమమైన ధర్మమేది? నిత్యము ఫలము నిచ్చే ధర్మమేది? దేనిని నిగ్రహించిన దుఃఖము కలుగదు? ఎట్టివారితో సంధి చెడదు?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ అనృశంస్య పరోధర్మ స్త్రయీ ధర్మః సదాఫలః
మనో యమ్య న శోచన్తి సంధి సద్భిర్న జీర్యతే ॥

**ధర్మరాజు చెప్పెను :-**

**భావము :- సర్వభూత దయయే ఉత్తమమైన ధర్మము. వేదము ప్రవచించు ధర్మమే శాశ్వత ఫలము నిచ్చు ధర్మము. మనస్సును నిగ్రహించిన వారికి దుఃఖము కలుగదు. సత్పురుషులతో స్నేహము ఎన్నడూ చెడదు.**

## వ్యాఖ్య

**"అనృశంస్య"** అనగా క్రూరత్వము లేకుండా ఉండుట అని నీలకంఠులు వ్యాఖ్యానించారు. ఈ స్థితి మనస్సుయొక్క శుద్ధసత్త్వమును స్పష్టం చేస్తూవుంది.

సత్త్వగుణ ప్రధానులైన వారు "త్రయీ" అనగా అకార, ఉకార, మకారము లనెడి మూడు మాత్రలతో ఏర్పడిన ప్రణవమును ధ్యానించి శాశ్వతమైన మోక్ష ఫలమును పొందగలరు.

ఈ ధ్యానమును నిర్విఘ్నముగా సాగించవలెనన్నచో మనసును నిగ్రహించాలి. ఎవరైతే మనసును నియమించి, ఓంకార ధ్యానమును సాగించి తరిస్తారో అట్టివారిని

శోకము చేరలేదు అనేది మూడవ ప్రశ్నకు సమాధానము. కనుక ఓంకారధ్యానము సర్వోత్కృష్టమైనది అని గ్రహించాలి.

*నాస్తి నాదో త్పరో మంత్రో న దేవః స్వాత్మనః పరః*

*నానుసంధేః పరా పూజా న హి తృప్తేః పరం సుఖమ్*

"ప్రణవనాదము కంటె గొప్ప మంత్రము లేదు. తన ఆత్మకంటె ఉన్నతుడైన దేవుడు లేడు. ధ్యానము కంటే మించిన పూజలేదు. తృప్తికి మించిన సుఖములేదు" అని యోగశిఖోపనిషత్తు.

మనసును నిగ్రహించడం సులువైన పని కాదని 8వ శ్లోకంలో గ్రహించినాము. అట్టి మనస్సును ఎలా నిగ్రహించాలి? ఏదో ఒక విషయంతో స్నేహం లేకుండా మనసు క్షణం కూడా ఉండలేదు.

ఈ ప్రపంచంలోని స్నేహాలన్నీ చెడిపోయేవే. చెడని స్నేహము సత్పురుష సాంగత్యమే. కనుక సాధకుడు సజ్జన సాంగత్యాన్ని పొందాలని నాల్గవ ప్రశ్నకు సమాధానం చెప్పాడు ధర్మరాజు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం ను హిత్వా ప్రియోభవతి కిం ను హిత్వా న శోచతి
కిం ను హిత్వార్థవాన్ భవతి కిం ను హిత్వా సుఖీభవేత్ ॥ 17

**యక్షుడు పలికెను :-**

**భావము :-** దేనిని త్యజించిన మనుష్యుడు ప్రియుడగును? దేనిని వదలిన మనుష్యుడు శోకింపడు? దేనిని విడిచిన మానవుడు సంపన్నుడగును? దేనిని వదలిన సుఖవంతుడగును?

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా న శోచతి
కామం హిత్వాఽ ర్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్ ॥

**ధర్మరాజు చెప్పెను :-**

**భావము :-** అభిమానాన్ని త్యజించినవాడు లోకప్రియుడవుతాడు. క్రోధాన్ని త్యజించినవాడు శోకరహితుడగుచున్నాడు. కామాన్ని త్యజించినవాడు భాగ్యవంతుడు కాగా లోభాన్ని విడిచినవాడు సుఖపడుతున్నాడు.

## వ్యాఖ్య

అభిమానాలు అనేకములున్నాయి. రూపాభిమానము, కులాభిమానము, ధనాభిమానము, విద్యాభిమానము ఇలా ఎన్నో ఉన్నాయి. వీటన్నిటికి ఆధారమైనది దేహాభిమానము.

దేహాభిమానమును వదలినవాడు దైవానుగ్రహానికి పాత్రుడగుచున్నాడు. దైవానికి ప్రియుడైనవాడు సర్వులకు ప్రియుడగుచున్నాడు. ఈ విధంగా అభిమాన రహితుడు లోకపూజితు డగుచున్నాడు.

**క్రోధః ప్రాణహరః** క్రోధము ప్రాణహరము అన్నది రామాయణము. **క్రోధాద్భవతి సమ్మోహః** క్రోధము వలన మోహము కలుగుతుందని గీత. మోహమునకు గురైనవాడు సత్యాసత్యాలను తారుమారుగా అవగతం చేసుకొని దుఃఖిస్తాడు. మోహము, దానికి కారణమైన క్రోధము తొలగితే శోకరహితుడగుచున్నాడు.

కామమనేది ఆరని అగ్ని. అది ఉన్నంతవరకు మనిషికి తృప్తిలేదు. కామాన్ని జయించగానే మనుజుడు ఆప్తకాముడై, ఆనందపరవశుడై శోభిస్తున్నాడు.

లాభం లేనివాడు ప్రపంచంలో లోభి ఒక్కడే. లోభం అంతరించిన వాని హృదయంలో దివ్యమైన లాభము శోభిస్తున్నందున అతడు సుఖవంతుడై భాసిస్తాడు.

గడచిన శ్లోకంలో దివ్యానందమును పొందుటకు మనోనిగ్రహము యొక్క ఆవశ్యకతను తెలియజేయడం జరిగింది. కానీ, అభిమానము, క్రోధము, కామము, లోభము - ఈ నాల్గింటిని జయించినపుడే మనసును నియమించుట సాధ్యపడుతుందని నీలకంఠీయము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిమర్థం బ్రాహ్మణే దానం కిమర్థం నటనర్తకే
కిమర్థం చైవ భృత్యేషు కిమర్థం చైవ రాజసు ॥ 18

**యక్షుడు అడిగెను :-**

**భావము :- బ్రాహ్మణునకు ఎందుకు దానమీయవలెను? నటనర్తకులకు ఎందుకు దానమీయవలెను? భృత్యులకు దానమిచ్చుట ఎందుకు? రాజులకెందుకివ్వాలి?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ ధర్మార్థం బ్రాహ్మణే దానం యశోఽర్థం నటనర్తకే
భృత్యేషు భరణార్థం వై భయార్థం చైవ రాజసు ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- ధర్మము కొరకు బ్రాహ్మణులకు దానమీయవలెను. కీర్తి కొరకు నటనర్తకులకు దానమీయవలెను. పోషించుటకు భృత్యులకు, భయముచేత రాజులకు ఇవ్వవలెను.

## వ్యాఖ్య

వేదాధ్యయనము ద్వారా, యజ్ఞయాగాది క్రతువుల నాచరించుట ద్వారా బ్రాహ్మణులు ఎనలేని సేవల నందిస్తారు. అట్టివారికి దక్షిణలిచ్చుట ద్వారా ధర్మజ్యోతికి నూనె పోసిన వారగుచున్నారు.

కళలను వృద్ధి చెందించుటకు నటనర్తకులను పోషిస్తారు. అలాంటివారి కళాపోషణ వలన కళాభివృద్ధి జరిగి పోషకుల కీర్తి శాశ్వతముగా ఉంటుంది.

సేవకులను పోషించుట యజమాని ప్రధాన కర్తవ్యముగా భావించాలి. సేవకులలో అసంతృప్తి చేరకూడదు. అది యజమానికి శ్రేయస్సును చేకూర్చదు.

పన్నులు చెల్లించకపోతే రాజదండనకు గురి కావలసివస్తుందనే భయం చేతనే రాజులకు ప్రజలు ధనాన్ని చెల్లిస్తూ ఉంటారు.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ కేనస్వి దావృతో లోకః కేనస్వి న్న ప్రకాశతే
కేన త్యజతి మిత్రాణి కేన స్వర్గం న గచ్ఛతి ॥ 19

యక్షుడు అడిగెను :-

భావము :- లోకము దేని చేత ఆవృతమై ఉన్నది? దేనిచేత ప్రకాశింప లేకున్నది? ఏకారణము చేత స్నేహితులను త్యజించుట జరుగుచున్నది? స్వర్గానికి చేరక పోవడానికి కారణమేమి?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ అజ్ఞానే నావృతో లోక స్తమసాన ప్రకాశతే
లోభాత్త్యజతి మిత్రాణి సంగాత్ స్వర్గం న గచ్ఛతి ॥

ధర్మరాజు చెప్పెను :-

భావము :- ప్రపంచము అజ్ఞానముచే ఆవరింపబడి యున్నది. అంధకారము వలన లోకము ప్రకాశింపకున్నది. లోభము వలన స్నేహితులను త్యజించుట జరుగుచున్నది. సంగత్వము వలన స్వర్గము నధిరోహించుట లేదు.

## వ్యాఖ్య

ఈ లోకము అజ్ఞానముచేత ఆవరింపబడి యున్నది. అజ్ఞానమును తొలగించి దర్శించినపుడే లోకము యొక్క యధార్థ స్వరూపము స్పష్టమౌతుంది. అప్పుడది లోకము కాదు. లోకేశ్వరుడే.

*అజ్ఞానేనావృతం జ్ఞానం తేన ముహ్యన్తి జంతవః*

"జ్ఞానము అజ్ఞానము చేత ఆవరింపబడి యున్నది. అందుచేత జీవులు మోహమును పొందుచున్నారు" అని భగవద్గీత - కర్మ సన్యాసయోగము తెల్పింది.

అజ్ఞానము వలననే జ్ఞానము తెలిసి రావడము లేదు. అజ్ఞానమునకు ఆవరణ విక్షేపములను రెండు శక్తులున్నాయి. ఉన్నదానిని దాచిపెట్టేది ఆవరణ దోషము కాగా, లేని దానిని ప్రదర్శించేది విక్షేపదోషము.

త్రాడును దర్శించని దశలో త్రాటిలో పాము కన్పించింది. త్రాడు తెలియక పోవడము ఆవరణ దోషముకాగా, లేని పామును త్రాటిలో దర్శించడము విక్షేప దోషము.

ఈ అజ్ఞానము నశింపక పోవుటకు కృపణత్వదోషమే కారణము. ఈ లోభమనే దోషము చేత శమము, దమము, తపస్సు, బ్రహ్మచర్యము మొదలైన స్నేహితులంతా దూరమవుతున్నారని మూడవ ప్రశ్నకు జవాబు.

విషయ సంగత్వము వలననే కామక్రోధలోభాలనే అడ్డుగోడలు నిర్మింప బడుతున్నాయని చివరి ప్రశ్నకు సమాధానము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ మృతః కథం స్యాత్ పురుషః కథం రాష్ట్రం మృతం భవేత్**
**శ్రాద్ధం మృతం కథం వా స్యాత్ కథం యజ్ఞో మృతో భవేత్ ॥ 20**

**యక్షుడు ప్రశ్నించాడు :-**

**భావము :-** పురుషుడు చనిపోవుట అనగానేమి? రాష్ట్రము మరణించుట అనగానేమి? శ్రాద్ధము చచ్చుట అనగానేమి? యజ్ఞము చచ్చుట అనగానేమి?

**యుధిష్ఠిర ఉవాచ :-**

**శ్లో॥ మృతో దరిద్రః పురుషో మృతం రాష్ట్ర మరాజకమ్**
**మృత మశ్రోత్రియం శ్రాద్ధం మృతో యజ్ఞ స్త్వ దక్షిణః ॥**

ధర్మరాజు చెప్పెను :-

భావము :- దరిద్రుడైన వాడు మృతునితో సమానము. రాజులేని దేశము చచ్చిన దానితో సమానము. శ్రోత్రియులు లేని శ్రాద్ధము మరణ సదృశము. దక్షిణలు లేని యజ్ఞము మరణ తుల్యము.

## వ్యాఖ్య

దరిద్రుడు అంటే లేనివాడు అని గాక ఉండి లేనట్లు జీవించే లోభి అని శ్రీ నీలకంఠులు వ్యాఖ్యానించారు. రాజులేని రాజ్యము అభ్యుదయానికి నోచుకోదు.

వేదాధ్యయన తత్పరులైన ఋత్విక్కులు వేదమంత్రార్థములను తెలిసి శ్రాద్ధ కర్మములను నిర్వహించినపుడే ఆహుతులు పితృదేవతలకు అందుతాయి. అట్టి శాస్త్ర పరిజ్ఞానము లేనివారు నిర్వహించే శ్రాద్ధము మరణ సదృశమే. జీవము లేనిదే అని భావము.

అట్టి ఋత్విక్కులకు పుష్కలంగా దక్షిణలివ్వాలి. అలా కానిచో అట్టి యజ్ఞము వృద్ధిని కోల్పోయి మరణ సదృశమవుతుంది. దక్షిణ లేక నీరసించిన ఋత్విక్కులనుండి కదిలే మంత్రాలు కూడా నీరసంగానే ఉంటాయి. నీరసంగా కదిలే మంత్రాలు యజ్ఞాన్ని నీరసింపచేస్తాయి. నశింపచేస్తాయి.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ కాదిక్కి ముదకం ప్రోక్తం కిమన్నం కించ వై విషమ్
శ్రాద్ధస్య కాల మాఖ్యాహి తతః పిబ హరస్వ చ ॥ 21

యక్షుడు అడిగెను :-

భావము :- దిక్కు అనగానేమి? ఉదకమనగానేమి? అన్నమనగా నేమి? విషమనగానేమి? శ్రాద్ధమునకు తగిన సమయమేది? ఆ తరువాత నీళ్ళుత్రాగు. నీళ్ళు పట్టుకుపో.

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ సన్తో దిగ్జల మాకాశం గౌరన్నం ప్రార్థనా విషమ్
శ్రాద్ధస్య బ్రాహ్మణః కాలః కథం వా యక్ష మన్యసే ॥

ధర్మరాజు చెప్పెను :-

భావము :- సత్పురుషుల మార్గమే దిక్కు. ఆకాశమే నీరు, ఆవే అన్నము. యాచించుటయే విషము. బ్రాహ్మణుని ఆగమనమే శ్రాద్ధమునకు తగిన కాలము. యక్షుడా! నీవేమనుకొనుచున్నావు?

## వ్యాఖ్య

సంత్ పురుషులే దిక్కు అనెడి మొదటి సమాధానమును నీలకంఠీయం చక్కగా వ్యాఖ్యానించింది.

***దిశతి ఉపదిశ తీతి దిక్ ఉపదేష్టార ఇత్యర్థః***

ఉపదిశతి అనగా ఉపదేశము చేయువారు. వారే సంతపురుషులు. కనుక మహాత్ములు చూపిన మార్గములోనే చరించి బ్రహ్మమును చేరాలి అని అర్థము.

ఆకాశమే నీరు అనిన రెండవ సమాధానములో నీరు అంటే పిండబ్రహ్మాండములని నీలకంఠ వాక్యము.

***పంచమ్యాం ఆహుతౌ ఆపః పురుష వచసో భవతి***

"అయిదవ ఆహుతి యందు నీరు పురుష వచనము వలన కలుగుచున్నది" అని వేదప్రమాణము. వ్యష్టిగా సమిష్టిగా నున్న జీవుడే ఇక్కడ నీరుగా తెలియుచున్నాడు.

ఇచ్చట నీరు జీవుడైనపుడు దానికి కారణమైన ఆకాశము ఈశ్వరుడుగా తెలియుచున్నది. జీవబ్రహ్మలకు భేదము లేనందున ఆకాశ జలములకు అభేదమును నిరూపించి అద్వైతమును ఆవిష్కరిస్తూ ఆకాశమే నీరు అని చెప్పుట జరిగింది.

ఆవే అన్నము అనునది మూడవ సమాధానము. **గచ్ఛతీతి గౌః ఇంద్రియమ్** అనే వ్యుత్పత్తి ననుసరించి గోవు అనగా ఇంద్రియములు లేదా వాటిచే గ్రహింపబడు ఇంద్రియ విషయాలు.

ప్రార్థన అనగా కామము కనుక విషయాలను అభిలషించే కామమును విషము అనడం జరిగింది. కామము వలన విషయేంద్రియ సంయోగము జరుగుట చేతనే జన్మకర్మలు కదులుతున్నాయి.

కనుక విషతుల్యమైన కామాన్ని నిర్జించాలి. ఇంద్రియాల్ని నిగ్రహించాలి. మహాత్ములు చూపిన మార్గంలో చరించి బ్రహ్మైక్యము నొంది తరించాలి. ఇది ధర్మరాజు ముక్తసరిగ చెప్పిన సమాధానము.

ఇక చివరగా బ్రాహ్మణుని రాకయే శ్రాద్ధమునకు తగిన సమయమని చెబుతూ సద్బ్రాహ్మణుడు లభించనపుడు ఆచరించే శ్రాద్ధము నిరుపయోగమే నని స్పష్టం చేశాడు.

"యక్షుడా! నీవేమనుకొనుచున్నావు?" అన్నాడు ధర్మరాజు ఒక వాక్యము అధికంగా. తన సమాధానాల చేత యక్షుడు సంతృప్తి చెందినట్లేనా! అనే ఆలోచన దానిలో ప్రధానంగా తెలుస్తున్నది.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ తపః కిం లక్షణం ప్రోక్తం కో దమశ్చ ప్రకీర్తితః**
**క్షమా చ కా పరా ప్రోక్తా కా చహ్రీః పరికీర్తితా ॥ 22**

**యక్షుడు అడిగెను :-**

**భావము :- తపస్సు యొక్కలక్షణమేమి? దమమనగానేమి? ఉత్తమమగు క్షమ ఎట్టిది? సిగ్గు అని దేని నందురు?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

**శ్లో॥ తపః స్వధర్మ వర్తిత్వం మనసో దమనం దమః**
**క్షమా ద్వంద్వ సహిష్ణుత్వం హ్రీ రకార్య నివర్తనమ్ ॥**

**యుధిష్ఠిరుడు చెప్పెను :-**

**భావము :- స్వధర్మము నాచరించుటయే తపస్సు. మనస్సును నియమించుటయే దమము. ద్వంద్వములను సహించుటయే క్షమ. చెడుకార్యములను విరమించుటయే సిగ్గు.**

## వ్యాఖ్య

పరధర్మముకంటె స్వధర్మమే శ్రేయోదాయకమని గీతాచార్యుని ప్రబోధము. అట్టి స్వధర్మమును ఆచరించుటయే తపస్సని ధర్మరాజు తెలుపుతున్నాడు.

ఆధ్యాత్మిక మార్గము మనో నిగ్రహము పైనే ఆధారపడి యున్నది. కనుక మనసును దమనము చేయుటయే దమమని చెప్పడం జరిగింది. మనోనిగ్రహాన్ని శమమని అంటాము. ఇచ్చట దమమని వాడటములో ఒక ప్రత్యేక అర్థము గోచరిస్తూ ఉంది. మనో నిగ్రహము సాధ్యము కానపుడు ఇంద్రియములను నియమించి తద్వారా మనసును నిగ్రహించవచ్చునని తెలుపుటకే అలా దమమని వాడబడింది.

ద్వంద్వాలను సహించుటయే క్షమ. దీనినే తితిక్ష అని సాధన చతుష్టయంలోని షట్కసంపత్తిలో గ్రహిస్తూ ఉంటాము. శీతోష్ణ, సుఖదుఃఖ, జయాపజయాలను సమానంగా చూచుటయే ఇచ్చట క్షమ అనబడింది. ద్వంద్వ సహనము ద్వైత భ్రాంతిని దాటుటకు సహకరిస్తుంది.

**ద్వంద్వై ర్విముక్తా స్సుఖ దుఃఖ సంజ్ఞైః**

**గచ్ఛ న్త్యమూఢాః పదమవ్యయం తత్ ॥**

"సుఖ దుఃఖాది ద్వంద్వముల నుండి విడిపడిన జ్ఞానులు అవ్యయమైన మోక్షమును పొందుచున్నారు" అని భగవద్గీత - పురుషోత్తమ ప్రాప్తి యోగము ప్రవచించింది.

స్వధర్మము నాచరిస్తూ, మనసును నిగ్రహిస్తూ, ద్వంద్వాల నతిక్రమించి జీవించే సాధకులు చెడు మార్గములలో ప్రవేశించుటకు వెనుకాడాలి. దానినే సిగ్గుగా నిర్వచించాడు ధర్మరాజు.

***దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీ రచాపలమ్***

ప్రాణులయందు దయ, లోలత్వము లేకుండుట, మృదుత్వము, సిగ్గు, చపలత్వము లేకుండుట వీటిని దైవీసంపదగా వర్ణించింది భగవద్గీత - దైవాసుర సంపద్విభాగ యోగము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం జ్ఞానం ప్రోచ్యతే రాజన్ కః శమశ్చ ప్రకీర్తితః
దయా చ కా పరా ప్రోక్తా కిం చార్జవ ముదాహృతమ్ ॥ 23

**యక్షుడు అడిగెను :-**

**భావము :- రాజా! దేనిని జ్ఞానమందురు? శమమనగా ఏది? పరమ దయ అని దేనినందురు? ఋజుత్వమనగా నేమి?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ జ్ఞానం తత్త్వార్థ సంబోధః శమ శ్చిత్త ప్రశాన్తతా
దయా సర్వ సుఖైషిత్వ మార్జవం సమచిత్తతా ॥

**యుధిష్ఠిరుడు పలికెను :-**

**భావము :- తత్త్వార్థమును పూర్ణముగా గ్రహించుటయే జ్ఞానము. చిత్త ప్రసాదమే శమము. సర్వప్రాణుల సుఖమును వాంఛించుటయే దయ. అందరి విషయంలోను, అన్ని సమయాలలోనూ ఒకే విధమైన మనసును కలిగియుండుట ఆర్జవము.**

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కః శత్రుర్దుర్జయః పుంసాం కశ్చ వ్యాధి రనన్తకః
కీ దృశశ్చ స్మృతః సాధు రసాధుః కీదృశః స్మృతః 24

**యక్షుడు అడిగెను :-**

**భావము :- జయించుటకు సాధ్యముకాని శత్రువెవరు? నయముగాని రోగమేది? ఎట్టివానిని సాధువు అందురు? ఎట్టివానిని అసాధువందురు?**

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ క్రోధః సుదుర్జయః శత్రుర్లోభో వ్యాధి రనన్తకః
సర్వభూత హితః సాధుః అసాధు ర్నిర్దయః స్మృతః

ధర్మరాజు చెప్పెను :-

భావము :- జయించుటకు సాధ్యము గాని శత్రువు క్రోధము. నయముగాని జబ్బు పిసినిగొట్టు తనము. సర్వప్రాణులకు మేలు చేయువాడే సాధువు. దయాహీనుడే అసాధువు.

## వ్యాఖ్య

క్రోధము, లోభత్వము, నిర్దయ - ఈ మూడింటిని ప్రయత్నపూర్వకముగా త్యజించాలి. ఈ మూడు ద్వైతభ్రాంతికి సంబంధించినవి. సర్వభూత దయ అనెడి అద్వైత జ్ఞానమును అలవరచుకోవాలి.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ కో మోహః ప్రోచ్యతే రాజన్ కశ్చమానః ప్రకీర్తితః
కి మాలస్యం చ విజ్ఞేయం కశ్చ శోకః ప్రకీర్తితః ॥ 25

యక్షుడు అడిగెను :-

భావము :- రాజా! మోహమనగా నేమి? మానమనగా నేమి? ఆలస్యమనగా నేమి? శోకమనగా నేమి?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ మోహో హి ధర్మ మూఢత్వం మాన స్త్వాత్మాభిమానతా
ధర్మ నిష్క్రియ తాలస్యం శోక స్త్వజ్ఞాన ముచ్యతే ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- ధర్మము తెలియక పోవడమే మోహము. తనను తాను గొప్పగా అభిమానించు కొనుటయే మానము. ధర్మము నాచరింపకుండుటయే సోమరితనము. అజ్ఞానమే దుఃఖము.

## వ్యాఖ్య

మోహమునకు లోనైనవాడు సత్యమును అసత్యముగా, అసత్యమును సత్యముగా భావించుట వలన దేహధర్మములను ఆత్మయందు, ఆత్మ ధర్మములను దేహమునందు

ఆరోపించుకొని అభిమానంతో ఊగిపోతూ ఉంటాడు. ధర్మాచరణ కుంటుపడుటచేత సోమరిగా మిగిలిపోతాడు.

సర్వదుఃఖములకు అజ్ఞానమే కారణమై యున్నది. ఆత్మజ్ఞానమును పొందినవాడు సమస్త దుఃఖముల నుండి విడిపడి సర్వోపద్రవ రహిత స్థితియగు మోక్షమును పొంది తరించుచున్నాడు.

***సార మేవ రసం లబ్ధ్వాసాక్షా ద్దేహే సనాతనమ్***

***సుఖీ భవతి సర్వత్ర అన్యథా సుఖితా కుతః***

"సారభూతమై, శాశ్వతమైనట్టి ఆత్మానంద రసమును పొంది జీవుడు అంతట సుఖవంతుడగుచున్నాడు. మరొక చోట సుఖమెక్కడుంది?" అన్నది కఠ రుద్రోపనిషత్తు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కిం స్థైర్య మృషిభిః ప్రోక్తం కించ ధైర్య ముదాహృతమ్
స్నానం చ కిం పరం ప్రోక్తం దానం చ కిమిహోచ్యతే ॥ 26

**యక్షుడు పలికెను :-**

**భావము :- ఋషులు దేనిని స్థైర్యమని అందురు? దేనిని ధైర్యమందురు? గొప్పదైన స్నానమేది? ఇచ్చట ఏది దాన మనబడుచున్నది?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ స్వధర్మే స్థిరతా స్థైర్యం ధైర్య మింద్రియ నిగ్రహః
స్నానం మనోమల త్యాగో దానం వై భూతరక్షణమ్ ॥

**యుధిష్ఠిరుడు చెప్పెను :-**

**భావము :- స్వధర్మమునందు స్థిరత్వమును కలిగియుండుటయే స్థైర్యము. ఇంద్రియములను నిగ్రహించుట ధైర్యము. మనసులోని మాలిన్యమును కడిగివేయుట స్నానము. ప్రాణులను కాపాడుటయే దానము.**

## వ్యాఖ్య

స్వధర్మ స్థితుడైన వాడే స్థైర్యవంతుడు. ధైర్యమనగా భౌతిక శక్తి ప్రదర్శనలు కావు. పరులను గెలుచుటయూ కాదు. తన ఇంద్రియములను అదుపులో ఉంచుకొని తనను తాను గెలుచువాడే నిజమైన ధైర్యవంతుడు.

దేహశుభ్రతను స్నానమని పరిగణించినా మనసులోని మలినమును శుద్ధి చేయుటయే నిజమైన స్నానమని మూడవ ప్రశ్నకు సమాధానం చెప్పి సర్వప్రాణులను రక్షించుటయే దయ అని నాల్గవ ప్రశ్నకు సమాధానమిచ్చాడు.

యుధిష్ఠిరుడు ఇక్కడ దయకు ఇచ్చిన నిర్వచనము విప్లవాత్మకమైనది. ఈ నిర్వచనము వేదాంత ప్రమాణము.

*స్వాత్మవత్సర్వభూతేషు కాయేన మనసా గిరా*
*సుజ్ఞా యా దయా సైవ ప్రోక్తా వేదాంతవేదిభిః ॥*

"దేహ మనోవాక్కులచే సమస్త జీవులయందు తనయందు వలెనే ప్రేమను కలిగియుండుట దయ అని వేదాంతము నెరిగినవారు పలుకుచుందురు" అని దర్శనోపనిషత్తు ప్రవచించింది.

తనను తాను ప్రేమించుకొనులాగున ఇతర ప్రాణులను ప్రేమించడమనేది ఆత్మవిదులకే సాధ్యం. ఇది లౌకికులకు ఎంత దుర్లభమో జ్ఞానులకు అంత సులభము. అందరిలోని ఆత్మ ఒక్కటేనని గ్రహించిన వారైనందున ఇతరులను తమకన్నా భిన్నంగా చూడలేరు. కనుక పరుల సుఖాన్ని తమ సుఖంగా, పరుల దుఃఖాన్ని తమ దుఃఖంగా భావించగలరు. ఈ సత్యాన్ని శ్రీశంకరులు తమ గీతాభాష్యంలో మరింత వైభవంగా ప్రవచించారు.

*యథా మమ సుఖ మిష్టం తథా సర్వప్రాణినామ్ సుఖమ్ అనుకూలమ్*
*యది వా యచ్చ దుఃఖమ్ మమ ప్రతికూలమ్ అనిష్టమ్ యథా తథా*
*సర్వప్రాణినామ్ దుఃఖ మనిష్టమ్*

"ఏది తనకు ఇష్టమైన సుఖమో అది సర్వజీవులకు ఇష్టమైన సుఖము. ఏది తనకు దుఃఖమో అది ఇతరులకు కూడా దుఃఖమే"నని సమదర్శన యోగి భావించును.

కనుక దయ అనేది సమదర్శనము చేయగల మహితాత్ముల యందే పూర్ణశోభతో గోచరించును అని వేదాంత నిర్ణయము.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కః పణ్డితః పుమాన్ జ్ఞేయో నాస్తికః కశ్చ ఉచ్యతే
కో మూర్ఖః కశ్చ కామః స్యాత్ కో మత్సర ఇతి స్మృతః ॥ 27

**యక్షుడు అడిగెను :-**

**భావము :- పండితుడని ఎవని నందురు? నాస్తికుడని ఎవనిని పిలుతురు? మూర్ఖుడెవరు? కామమనగా నేమి? మత్సర మనగానేమి?**

## వ్యాఖ్య

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ ధర్మజ్ఞః పణ్డితో జ్ఞేయో నాస్తికో మూర్ఖ ఉచ్యతే
కామః సంసార హేతుశ్చ హృత్తాపో మత్సరః స్మృతః ॥

**ధర్మరాజు పలికెను :-**

**భావము :- ధర్మము నెరిగినవాడే పండితుడు. మూర్ఖుడే నాస్తికుడు. సంసారహేతువే కారణము. హృదయ తాపమే మత్సరము.**

## వ్యాఖ్య

ధర్మమును తెలిసినవాడే పండితుడు గాని మస్తకంలో పుస్తకాలను మోస్తూ, పుస్తకాలలో ప్రాకే పురుగు కాదని ధర్మరాజు మొదటి ప్రశ్నకు సమాధానమిచ్చాడు.

27వ శ్లోకములో యక్షుడు 5 ప్రశ్నలు వేయగా ధర్మరాజు నాలుగు సమాధానాలు మాత్రమే ఇవ్వడం జరిగింది. రెండు, మూడు ప్రశ్నలు ఒకే సమాధానముతో సరిపడుటయే, ముడిపడుటయే దీనికి కారణము.

**నాస్తికో మూఢ ఉచ్యతే** అన్నది శాస్త్రము. నాస్తికుని మూర్ఖుడు అని నిర్వచించినపుడు మూర్ఖుడెవరు? అంటే నాస్తికుడే అని సమాధానము.

'నాస్తి' అంటే లేనిది అని అర్థము. "ఏది లేనిది"? అని ప్రశ్న తలెత్తినపుడు "పరలోకే" అని సిద్ధాంతకౌముది వ్యాఖ్యానించింది.

**నాస్తికః అస్తి నాస్తి దిష్టం మతిః** అని పాణినీ సూత్రము నాస్తిక పదానికి వ్యుత్పత్తిని విశదీకరించింది.

ఈ ప్రపంచము కన్నా అతీతంగా మరొక లోకమున్నదనేది వ్యక్తి యొక్క విశ్వాసముపై ఆధారపడి ఉంది. అట్టివిశ్వాసము గల వానిని ఆస్తికుడు అంటారు. ఈ భౌతిక ప్రపంచమే సత్యము; దీనికి మించి పరలోక మనేది లేదు అని విశ్వసించే వానిని నాస్తికుడు అంటారు.

ఈ విధమైన భౌతికవాద ప్రలాపములు చేయువాడు నాస్తికుడని, మూర్ఖత్వమే అతని అక్షయ ధనమని ధర్మరాజు రెండు, మూడు ప్రశ్నలకు కలిపి సమాధానము నిచ్చాడు.

**To me a purely materialistic philosophy is the height of unintelligence.**

"కేవలం భౌతిక వాదాన్నే విశ్వసించే తత్త్వము మూర్ఖత్వానికి పరాకాష్ఠ" అని ఖగోళ శాస్త్రజ్ఞుడు ఆర్.ఎ.మల్లికన్ తన అభిప్రాయాన్ని ప్రకటించాడు.

కామమనేది ఆరని అగ్ని. సంసారతాపానికి కామమే కారణము. కామము వల్లనే జీవులకు జనన మరణాలు సంభవిస్తున్నాయి. అనంత దు:ఖానికి కారణమైన కామాన్ని సంసారహేతువుగా వర్ణించాడు ధర్మరాజు.

అన్యుల అభివృద్ధిని గాంచి ఆవేదన చెందే మనస్తత్వమే మత్సరము. మత్సరగ్రస్తులైన వారికి ఈ ప్రపంచంలో సుఖంలేదు. అకారణ తాపానికి గురిఅయ్యే వారి గుండె మంటలను ఎవ్వరూ ఆర్పలేరు. అది గుండె కాదు. నిత్య దుఃఖాగ్నిహోత్రం.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ కోఽహంకార ఇతి ప్రోక్తః కశ్చ దమ్భః ప్రకీర్తితః
కిం తద్దైవం పరంప్రోక్తం కిం తత్పైశున్య ముచ్యతే ॥ 28

**యక్షుడు పలికెను :-**

**భావము :- అహంకారము అని దేని నందురు? దంభమనగా నేమి? పరదైవమనగా నేమి? చాడీలు చెప్పట అని దేని నందురు?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ మహాజ్ఞాన మహంకారో దమ్భోధర్మో ధ్వజోచ్ఛ్రయః
దైవం దాన ఫలం ప్రోక్తం పైశున్యం పరదూషణమ్

**ధర్మరాజు చెప్పెను :-**

**భావము :- మితిమీరిన అజ్ఞానమే అహంకారము. కీర్తి కొరకు ఆచరించు ధర్మమే దంభము. దాన ఫలమే దైవము. ఇతరులను దూషించుటయే చాడీలు చెప్పు గుణము.**

## వ్యాఖ్య

అనిత్యమును నిత్యముగా భావించు అజ్ఞాని దేహమే తానని పూర్ణంగా విశ్వసించి, ఆ తరువాత దేహాభిమానంతో విర్రవీగుతుంటాడు. ఈ వెఱ్ఱితనాన్నే అహంకార మంటున్నాడు ధర్మరాజు.

ధర్మములోని విశిష్టతను గుర్తించకుండా, పేరు ప్రఖ్యాతులను వాంఛించి, నటుని వలె ప్రదర్శించు ధర్మమే దంభము.

దైవమనగా ఇచ్చట అదృశ్యమని భావము. అదియే అదృష్టము కూడా. గత జన్మలో మనం ఆచరించిన కర్మయే దైవము గాను, ఈనాడు అందుచున్న ఫలము దానియొక్క అదృశ్యఫలముగాను తెలియుచున్నది. ఈ విషయమును భగవద్గీత - మోక్ష సన్న్యాస యోగము నందలి 14వ శ్లోకము వివరించినది.

**పూర్వ జన్మ కృతం కర్మ తద్దైవమితి కథ్యతే**

అని శాస్త్ర వచనము కూడా.

పరులను దూషించుటయే పైశున్యమని ధర్మరాజు నాల్గవ ప్రశ్నకు సమాధానమిచ్చాడు.

కొండెములు చెప్పువాడు కొండెగాడు. నిజానికి తేలుకొండెగాడు. కొండంత అపకారంచేసి నిండుకుండలా కదలకుండా ఉంటాడు. బ్రతుకులతో చెండాడుతాడు. పరుల కష్టాన్ని పుష్పాలుగా సేకరించి, వాటిని దండ గట్టుకొని, మెడలో అలంకరించుకొని ఊరేగే బండరాతి గుండెగల చండాలుడు.

కొండెతో తేలు దేహాన్ని కుడుతుంది. కొండెము అనే కొండెతో కొండెగాడు చెవిని కుడుతాడు. తేలు తెలియకుండా కుడుతుంది. కొండెగాడు నిజం తెలియనివ్వకుండా చెవిలో అబద్ధాలు నూరిపోస్తాడు.

ఏ తప్పు చేయకనే తేలుకుట్టుకు గురియై మనుష్యులు బాధపడునట్లు, నిష్కారణంగా కొండెగాని కాటుకు అమాయకులు బలి అవుతుంటారు.

వీనులలో విషాన్ని క్రుమ్మరించే కొండెగాడు తేలు కొండె కన్నా భయంకరమైనవాడు అని గ్రహించాలి.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ ధర్మశ్చార్థశ్చ కామశ్చ పరస్పర విరోధినః
ఏషాం నిత్య విరోధానాం కథమేకత్ర సఙ్గమః ॥ 29

**యక్షుడు పలికెను :-**

**భావము :- ధర్మము, అర్థము, కామము అనునవి ఒకదానితో ఒకటి వైరుధ్యమును కలిగి ఉంటాయి. నిత్య విరోధులైన ఈ మూడు ఒక చోట ఐకమత్యముతో ఉండుట ఎలా సంభవము?**

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ యదా ధర్మశ్చ భార్యా చ పరస్పర వశానుగౌ
తదా ధర్మార్థ కామానాం త్రయాణా మపి సఙ్గమః

**యుధిష్ఠిరుడు చెప్పెను :-**

**భావము :- ధర్మము, భార్య పరస్పరము వశమై ప్రవర్తించినచో ధర్మార్థకామములు మూడును ఒక్కచోట ఐకమత్యముతో వసించును.**

## వ్యాఖ్య

ధర్మార్థకామముల నాచరించుట యందు భర్త శాస్త్ర విహితంగా చరిస్తూ ఉండగా, భార్య భర్తకు సహకరించినచో ధర్మార్థకామ ఫలములు లభించుటయే గాక ఆ త్రివర్గములు ఒకే చోట కలిసి కనిపించును.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ అక్షయో నరకః కేన ప్రాప్యతే భరతర్షభ
ఏతన్మే పృచ్ఛతః ప్రశ్నం తచ్ఛీఘ్రం వక్తుమర్హసి ॥ 30

యక్షుడు పలికెను :-

భావము :- రాజా! భరతకులశ్రేష్ఠా! నశించని నరకము దేనివలన కలుగును? ఈ ప్రశ్నకు శీఘ్రంగా సమాధానం చెప్పాలి.

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ బ్రాహ్మణం స్వయ మాహూయ యాచమాన మకించనమ్
పశ్చా నాస్తీతి యో బ్రూయాత్ సోఽక్షయం నరకం వ్రజేత్ ॥

శ్లో॥ వేదేషు ధర్మశాస్త్రేషు మిథ్యా యోవై ద్విజాతిషు
దేవేషు పితృధర్మేషు సోఽక్షయం నరకం వ్రజేత్ ॥

శ్లో॥ విద్యమానే ధనే లోభాత్ దాన భోగ వివర్జితః
పశ్చాన్నాస్తీతి యో బ్రూయాత్ సోఽక్షయం నరకం వ్రజేత్ ॥

ధర్మరాజు చెప్పెను :-

భావము :- యాచకుడైన బ్రాహ్మణుని తనకు తానుగా పిలిచి, వచ్చిన తరువాత "లేదు పో" అనువాడు నశించని నరకమును పొందుచున్నాడు.

వేదములు, ధర్మశాస్త్రములు, బ్రాహ్మణులు, దేవతలు, పితృధర్మములు అసత్యములు అని భావించువాడు నశించని నరకమును పొందుచున్నాడు.

ధనము ఉన్నను లోభగుణము వలన తాను అనుభవించక, ఇతరులకు పెట్టక సదా "లేదు-లేదు" అనువాడు నశించని నరకమును పొందును.

## వ్యాఖ్య

మనిషికి నిత్యసుఖం కావాలి. కానీ ఈ ప్రపంచంలో సంపదలు అనిత్యాలు. అనిత్యమైన సంపదలు నిత్య సుఖాన్నివ్వలేవని గ్రహించిన వారి జీవన దృక్పథమే గాక జీవన మార్గము కూడా నూతన మలుపు తిరుగుతుంది.

*జానామ్యహం శేవధిరిత్య నిత్యం*
*నహ్యధ్రువైః ప్రాప్యతే హి ధ్రువం తత్*

"సంపదలు అనిత్యాలని నాకు తెలుసు. అధ్రువమైనవి ధ్రువమైన దానిని అందించలేవు." అని కఠోపనిషత్తులో యమధర్మరాజు ప్రవచించాడు.

సంపదలు లక్ష్యసిద్ధికి సోపానాలు కావాలేగాని అవరోధాలు కాకూడదు. అడ్డంకులుగా, ఆటంకాలుగా మిగలకూడదు. బ్రహ్మజ్ఞానము కలవాడు బ్రాహ్మణుడు. అట్టివానికి నిరాశను కల్పించరాదు. అతడు దరిద్రుడని ఈసడించరాదు.

మనసుతో రాజీపడి ఈ ప్రపంచంలో చాలామంది ధనికులైతే, మనసుతో రాజీపడలేక కొంతమంది కోరి దరిద్రులయ్యారు. మొదటివారు అధర్మపరులు. రెండవ వారు ధర్మాత్ములు.

ధర్మసంపదను పొందినవారు భౌతికంగా దరిద్రులు కావచ్చు. భౌతిక సంపదలను అధర్మంగా పొందియున్నవారు సత్యరాజ్యంలో బికారులే.

ఇంతకీ, బ్రాహ్మణుడు లేదా పండితుడు ఎందుకని దరిద్రుడయ్యాడు? తన మనసంతా శ్రేయోమార్గమునందే చరించుట చేత. శాస్త్ర హృదయాన్ని దోచుకొనే యత్నంలో నిమగ్నమై, భౌతికంగా దివాలా తీశాడు.

కాని, తాను సాధించిన శాస్త్రపాండిత్యమంతా సమాజానికి ఉపకరించేది. సమాజాభ్యుదయాన్ని కాంక్షించి జీవించే శుభచరితుని ఉద్ధరించవలసిన బాధ్యత సమాజంపై ఉంది. ఈ బాధ్యతను విస్మరించి విపరీత ధోరణులతో వికటాట్టహాసం చేసే విత్తవంతులు విషవలయంలో పడతారని ధర్మరాజు ధృవీకరించాడు. అంతేకాదు, వారలా ప్రవర్తించడానికి వేదమునందు, ధర్మశాస్త్రములయందు విశ్వాసము లేకపోవడమే కారణమని కూడా చెప్పాడు.

ధర్మాభివృద్ధికి వినియోగపడవలసిన ధనాన్ని అలా ఉపయోగించక, లుబ్ధులై జీవించు అప్రయోజకులు, ద్వారాన్ని మూసినా కూడా వెనుకాడక, గోడ దూకైనా నరకంలో ప్రవేశిస్తారని ధర్మజ్ఞుడైన యుధిష్ఠిరుడు నిర్ణయించి మరీ చెప్పాడు.

❀ ❀ ❀

**యక్ష ఉవాచ :-**

**శ్లో॥ రాజన్ కులేన వృత్తేన స్వాధ్యాయేన శ్రుతేన వా**
**బ్రాహ్మణ్యం కేన భవతి ప్రబ్రూహ్యేతత్ సునిశ్చితమ్ ॥ 31**

**యక్షుడు అడిగెను :-**

**భావము :- రాజా! బ్రాహ్మణత్వము అనేది కులముచేతనా? ఆచారము చేతనా? వేదాధ్యయనము చేతనా? పాండిత్యము చేతనా? సునిశ్చితంగా చెప్పు.**

**యుధిష్ఠిర ఉవాచ :-**

**శ్లో॥ శృణు యక్ష కులం తాత న స్వాధ్యాయో న చ శ్రుతమ్**
**కారణం హి ద్విజత్వే చ వృత్తమేవ న సంశయః ॥**

శ్లో॥ వృత్తం యత్నేన సంరక్ష్యం బ్రాహ్మణేన విశేషతః
అక్షీణవృత్తో న క్షీణో వృత్తతస్తు హతో హతః ॥

శ్లో॥ పఠకాః పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్ర చిన్తకాః
సర్వే వ్యసనినో మూర్ఖా యః క్రియావాన్ స పండితః ॥

శ్లో॥ చతుర్వేదోఽపి దుర్వృత్తః స శూద్రా దతిరిచ్యతే
యోఽగ్నిహోత్ర పరోదాన్తః స బ్రాహ్మణ ఇతి స్మృతః ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- నాయనా! యక్షా! విను! బ్రాహ్మణుడు అగుటకు కులముగాని, స్వాధ్యాయముగాని, పాండిత్యము గాని కారణములు కావు. అతని ప్రవర్తనే కారణము. ఈ విషయంలో సందేహము లేదు.

బ్రాహ్మణుడు గొప్ప పట్టుదల కలవాడై ప్రవర్తనను రక్షించుకోవాలి. నడవడి చెడనిచో నరుడు పతనం కాడు. నడవడి చెడినవాడు చచ్చినవానితో సమానము.

వేదాల్ని పఠించేవారు, పఠింప చేయువారు, శాస్త్రచర్చలు చేయువారు మూర్ఖులు. వేదాలు బోధించినట్లు సన్మార్గములో చరించువాడే పండితుడు.

చతుర్వేది అయినా చెడు నడవడి కలవాడు చండాలుడే. అగ్నిహోత్రము నాచరిస్తూ, ఇంద్రియ మనసులను నిగ్రహించువాడే నిజమైన బ్రాహ్మణుడు.

❀ ❀ ❀

యక్ష ఉవాచ :-

శ్లో॥ ప్రియవచన వాదీ కిం లభతే విమృశిత కార్యకరః కిం లభతే
బహు మిత్ర కరః కిం లభతే ధర్మేరతః కిం లభతే కథయ ॥32

యక్షుడు పలికెను :-

భావము :- ప్రియ భాషణములు పలుకువాడు ఏమి పొందును? మంచి చెడులను సమగ్రంగా ఆలోచించి పనులు చేయువాడు ఏమి పొందును? ఎక్కువమంది స్నేహితులను గలవాడు ఏమి పొందును? ధర్మమునందు ప్రీతి కలవాడు ఏమి పొందును?

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ ప్రియవచన వాదీ ప్రియో భవతి
విమృశిత కార్యకరోఽధికం జయతి
బహుమిత్ర కరః సుఖం వసతే
యశ్చ ధర్మరతః సుగతిం లభతే ॥

ధర్మరాజు చెప్పెను :-

భావము :- ప్రియవాది ప్రియుడగును. విచారించి కార్యముల నాచరించువాడు ఎక్కువ విజయాలను సాధించును. పెక్కుమంది మిత్రులు కలవాడు సుఖముగా జీవించును. ధర్మము నందు ప్రీతి కలవాడు సుగతిని పొందును.

యక్ష ఉవాచ :-

శ్లో॥ కో మోదతే కి మాశ్చర్యం కః కః పన్థాః కా చ వార్తికా
వదమే చతురః ప్రశ్నాన్ మృతా జీవన్తు బాంధవాః ॥ 33

యక్షుడు అడిగెను :-

భావము :- ఆనందించువాడెవడు? ఆశ్చర్యకరమైన విషయమేమి? చరించవలసిన దారి ఏది? విశేషమగు వార్త ఏమి? ఈ నాలుగు ప్రశ్నలకు సమాధాన మిచ్చావా! మృతులైన నీ సోదరులు తిరిగి జీవిస్తారు.

యుధిష్ఠిర ఉవాచ :-

శ్లో॥ పంచమేఽహాని షష్ఠే వా శాకం పచతి స్వేగృహే
అనృణీ చాప్రవాసీ చ స వారిచర మోదతే ॥

శ్లో॥ అహన్యహాని భూతాని గచ్ఛన్తీహ యమాలయమ్
శేషాః స్థావర మిచ్ఛన్తి కిమాశ్చర్య మతః పరమ్ ॥

శ్లో॥ తర్కోఽప్రతిష్ఠః శ్రుతయో విభిన్నా
నైకో ఋషి ర్యస్య మతం ప్రమాణమ్
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం
మహాజనో యేన గతః స పన్థాః ॥

శ్లో॥ అస్మిన్ మహామోహమయే కటాహే సూర్యాగ్నినా రాత్రి దివేన్ధనేన
మాసర్తు దర్వీ పరిఘట్టనేన భూతాని కాలః పచతీతి వార్తా ॥

యుధిష్ఠిరుడు చెప్పెను :-

భావము :- జలచరుడవైన ఓ యక్షుడా! ఎవడు అయిదారు దినములకు కూరల భోజనము చేయుచు, అప్పు తప్పుయని తెలిసి, తిరుగుబోతు కానివాడు, ఆనందముగా జీవించును.

ప్రతిరోజు జీవులు యమసదనానికి పోవుచునే యున్నారు. మిగిలిన వారు తాము పోయేవారము కాము అని భావిస్తూ ఉన్నారు. ఇంతకంటె ఆశ్చర్యమేమున్నది?

**తర్కము చంచలమైనది. వేదాలు బహువిధాలుగా ఉన్నాయి. ఇతడు చెప్పిందే ప్రమాణమని ఒక ఋషిని చెప్పలేము. ధర్మము యొక్క తత్త్వము నిగూఢమైనది. కనుక మహాత్ములు నడచిన బాటయే మిగిలిన వారికి మార్గము.**

**ఈ ప్రపంచము మోహముతో నిండిన ఒక పెద్ద పాత్ర. రాత్రియందు అగ్నిని, పగటియందు సూర్యుని వంటచెఱకుగా వినియోగించుకుంటూ, మాసాలు, ఋతువులు అను గరిటెతో కలియబెడుతూ కాలపురుషుడు జీవులను వంట చేయుచున్నాడు. ఇదీ వార్త.**

## వ్యాఖ్య

అప్పు తెలియని వాడు ముప్పు నెరుగడు. దేశదిమ్మరి కానివాడు అప్పులపాలు కాడు. అప్పుచేసి పప్పుకూటిని నేతితో కలపడం కన్నా, సాధారణంగా భుజించి, ఏ పప్పో, నెయ్యో అయిదారు రోజుల కొకసారి తింటే దారిద్ర్యమనే నూతిలో పడకుండా, ఆనందంగా తీరాన జీవించవచ్చు. "ఎవడు ఆనందించును?" అని యక్షుడడిగిన మొదటి ప్రశ్నకు ధర్మరాజు ఇచ్చిన భావగర్భిత సమాధానమిది.

ముక్తసరిగా చెప్పాలంటే "మంచ మున్నంత కాళ్ళు చాచుకో. పిండిని బట్టి రొట్టె వేసుకో" అనడమే.

***ఉదర సమాతా అన్నలే తనహి సమాతా చీర్***

***అధిక హి సంగ్రహ నాకరే తిసకా నామ ఫకీర్ ॥***

"కడుపుకు కబళం, ఒంటికి వస్త్రము - దానికిమించి ఎవనికి సంగ్రహబుద్ధి ఉండదో వాడే ఫకీరు" అన్నాడు కబీరు.

నిత్యము ఎందరో మరణిస్తున్నా, తాము మాత్రం స్థిరమని జనులు భావిస్తున్నారు. ఇంతకు మించిన ఆశ్చర్యమేమున్నది? అని రెండవ ప్రశ్నకు సమాధాన మిచ్చాడు ధర్మరాజు.

జీవితారణ్యంలో పయనించే జీవులకు మహాత్ములు నడచినబాటయే శ్రేయోమార్గమని ధృవీకరించి, జీవుల అనిత్య జీవనమే వేదాంతం మ్రోగించే డిండిమ మని నాల్గవ ప్రశ్నకు ధర్మరాజు సమాధాన మిచ్చాడు.

**యక్ష ఉవాచ :-**

శ్లో॥ వ్యాఖ్యాతా మే త్వయా ప్రశ్నా యథా తథ్యం పరన్తప
పురుషం త్విదానీం వ్యాఖ్యాహి యశ్చ సర్వ ధనీ నరః ॥ 34

**యక్షుడు అడిగెను :-**

**భావము :-** హే ధర్మరాజా! నా ప్రశ్నలకు వివరంగా సమాధానము లిచ్చావు. అందరికంటే ధనవంతుడైన పురుషుడెవ్వడు? నరుడెవ్వడు?

**యుధిష్ఠిర ఉవాచ :-**

శ్లో॥ దివం స్పృశతి భూమించ శబ్దః పుణ్యేన కర్మణా
యావత్ స శబ్దో భవతి తావత్ పురుష ఉచ్యతే ॥

శ్లో॥ తుల్యే ప్రియాప్రియే యస్య సుఖదుఃఖే తథైవ చ
అతీతానాగతే చోభే సవై సర్వ ధనీ నరః ॥

**యుధిష్ఠిరుడు పలికెను :-**

**భావము :-** ఎవని పుణ్యకర్మ వలన జనించిన కీర్తిశబ్దము భూమ్యాకాశములను స్పృశించు చుండునో అతడే పురుషుడు.

ప్రియాప్రియములు, సుఖదుఃఖములు, భూత భవిష్యత్తులు అను ద్వంద్వములను ఏకముగా భావించువాడు అందరికంటె గొప్ప భాగ్యవంతుడైన నరుడు.

## వ్యాఖ్య

పుణ్యకర్మల నాచరించు పుణ్యాత్ముని పురుషుడనియు, ద్వంద్వాతీతుడైన జ్ఞానిని అక్షయ సంపద గల నరుడనియు ధర్మరాజు సమాధానము పలికాడు.

పుణ్యకర్మలాచరించు పురుషునికి ఆలంబనము దేహమే కనుక పురము నందు ఉన్నవాడై, దేహాభిమానము నుండి విడిపడక పురుషుడుగా తెలియుచున్నాడు.

ప్రియాప్రియములు లేనివాడు అనగా ఆప్తకాముడు. సుఖదుఃఖములకు అతీతుడనగా గుణరహితుడు. ద్వంద్వాతీతుడు అనగా స్థితప్రజ్ఞుడు. అట్టి జ్ఞానియే అక్షయ సంపదను పొందిన నరుడుగా వర్ణించబడినాడు.

***యక్ష యుధిష్ఠిరుల మధ్య నడచిన ప్రశ్నోత్తర మాలిక ఇంతటితో సమాప్తమైనది.***

## సమబుద్ధి

"ధర్మరాజా! పురుషుడెవరో, నరుడెవరో చక్కగా తెలిపావు. నీ తమ్ములు నలుగురిలో ఒకరిని బ్రతికించుటకు నా సంసిద్ధతను వ్యక్తం చేయుచున్నాను. నీ ఇష్టమొచ్చిన వారిని కోరుకో. అతడు బ్రతుకుతాడు" అని యుధిష్ఠిరుని ధర్మనిష్ఠను పరీక్షించుటకు యక్షుడు ప్రశ్నించాడు.

"ఓ యక్షుడా! అడుగో శ్యామవర్ణము వాడు, పొడవైన శరీరము, విశాల వక్షస్థలము బలమైన భుజములు గల అతడే - నకులుడు ....... అతడు జీవించుగాక!" అన్నాడు ధర్మరాజు.

"ధర్మరాజా! భీముడు నీకు ప్రియమైన వాడని చాలామంది చెప్పుకుంటారు. భీముడు పదివేల యేనుగుల బలముతో సమానుడని ప్రతీతి. అట్టి భీముని వదలి ఎందులకు నకులుని కోరుచున్నావు?

"యుధిష్ఠిరా! భుజపరాక్రమము గలవారిలో అర్జునుడు దిట్ట. మీకు అతడొక పెద్ద అండయని, కొండయని చెబుతారు. అట్టి అర్జునుని విడచి నకులుని ఎందుకు కోరుచున్నావు?" అని యక్షుడు ప్రశ్నించాడు. ధర్మాత్ముడైన యుధిష్ఠిరుడు యక్షునితో ఈ విధంగా సమాధానం పలికాడు.

*ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః*

*తస్మాద్ ధర్మం న త్యజామి మా నో ధర్మో హతో ఽవధీత్ ॥*

"తనను శిక్షించిన వానిని ధర్మము శిక్షిస్తుంది. తనను రక్షించిన వానిని ధర్మము రక్షిస్తుంది. కనుక నేను ధర్మాన్ని ఎన్నడూ త్యజించను. మేము ధర్మమును హింసించి ధర్మముచే నశింపకుండెదము గాక!

"యక్షుడా! సమత్వము సత్యము కంటె మిన్నయని నా అభిప్రాయము. విషమత్వము మరణము. సమత్వమే జీవనము. ఈ సమతను వాంఛించు నేను మమతకు ప్రాధాన్యమివ్వను. అందుకని నకులుని బ్రతికించమని కోరుచున్నాను.

"ధర్మరాజునైన నేను ఎన్నడూ ధర్మము తప్పనని ప్రజలు చెప్పుకుంటూ ఉంటారు. ప్రజల నమ్మకాన్ని నేను వమ్ముచేయలేను. నకులుడే బ్రతకాలి.

"మహాత్మా! మాతండ్రియైన పాండురాజుకు కుంతి, మాద్రి అను భార్యలు ఇద్దరు. మా తల్లులిద్దరూ సంతానవతులుగానే ఉండాలని నా అభీష్టము.

"నేను, భీముడు, అర్జునుడు కుంతీ కుమారులము. నకులుడు, సహదేవుడు మాద్రీకుమారులు. నా తల్లికి నేను బ్రతికియున్నాను. నకులుడు జీవిస్తే మాద్రి సంతతికూడా వర్థిల్లుతుంది.

"యక్షుడా! ఇద్దరు తల్లుల విషయంలో నాకు సమత్వమే ఉన్నది. కనుక నకులుని బ్రతికించు;" అన్నాడు ధర్మరాజు.

యక్షుని హృదయం ఆనందంతో ఉప్పొంగింది. ధర్మరాజు ధర్మనిష్ఠకు, సమదృష్టికి యక్షుడు ఆశ్చర్యచకితుడయ్యాడు.

"ధర్మరాజా! అర్థకామాలకన్నా ధర్మానికే ప్రాధాన్యమిచ్చావు. ధర్మమునుండే అర్థకామాలు పుడుతాయని గ్రహించావు. సమత్వమును పరమ ధర్మముగా భావించావు. నీ తమ్ములు నలుగురు సజీవులగుచున్నారు" అనగానే భీమార్జున నకుల సహదేవులు నిద్రనుండి లేచినట్లు లేచారు. క్షణంలో ఆకలిదప్పులు అదృశ్యమయ్యాయి.

"నాయనా! ధర్మరాజా! నిన్ను పరీక్షించాలని అభిలషించి బ్రాహ్మణుని అరణిని అపహరించుట జరిగింది. ఇదిగో అరణి తీసుకో. ఇది మీకు అజ్ఞాతవాస సమయము. మీరు ఎవరు, ఎక్కడ ఏ రూపమును ధరింపవలెనని సంకల్పింతురో అట్టి రూపమును బొందునట్లు వరమిచ్చుచున్నాను. మిమ్మల్ని ఎవరూ గుర్తించరు. ఇంకేమైనా కావలసినచో అడగండి" అని యక్షుని రూపంలో నున్న యమధర్మరాజు కుమారుడైన ధర్మరాజుని ప్రశ్నించాడు.

"తండ్రీ! నీ దయకు పాత్రులమైన మేము ధన్యులము. అంతకు మించి కోరదగిన దేమున్నది? ఆదిదేవా! నా మనసు క్రోధమోహాదుల యందు చిక్కకుండా ఉండునట్లు అనుగ్రహించు. చాలు;"

***ఆదిదేవుడవైన నీవు దయామతిం బొడసూపి న***

***న్నాదరించుట జేసి ధన్యుడనైతి నింతకు నొక్కడొం***

***దేది గల్గెడు నైన నా మది యెల్ల నాడును గ్రోధమో***

***హాదులం బెడబాసి ధర్మువునందు నెక్కొన జేయవే॥***

అని ధర్మాసక్తితో యుధిష్ఠిరుడు ప్రార్థించగనే యమధర్మరాజు అట్టి వరాన్నొసగి అంతర్హితుడైనట్లు ఆంధ్ర భారతంలో ఎఱ్ఱాప్రెగడ.

సమాప్తము

A C No. 94563



స్వర్ణోత్సవ కెరటాలు - 2

ఈ ప్రపంచంలో ఎవరైనా బతుకొచ్చు. ఈ జగతి ఎంతైనా ఎండమావే.

జగతికి చీకట్లు జీవికి ఇక్కట్లు చిక్కని కాళ్ళ జీవితాకాశంలో అంధకారం ఎప్పుడు అలుముకుంటుందో ఎవరికీ అర్థంగాని విరుద్ధ పరిస్థితులలో మన కంటూ ఒక వెలిగే దీపం ఉండాలి. మనదంటూ ఒక వెలిగే కాంతి తోడు కావాలి.

ఆ జ్యోతి ఆరేది కాకూడదు. మారేది కాకూడదు. మారని, ఆరని జ్యోతి ఆధ్యాత్మిక జ్యోతి.

మహర్షులు అనుగ్రహించిన ఆధ్యాత్మిక ప్రసాదమును విశేషంగా వితరణ చేసింది సుందర చైతన్యాశ్రమం.

ఐదు పదులలో స్వామీజీ అడుగిడుతున్న ఈ సంవత్సరాన్ని **"చైతన్య స్వర్ణోత్సవ సంవత్సరం"** గా భక్తులు ప్రకటించారు.

విలువైన వేదాంత గ్రంథాలను విరివిగా అందించిన సుందర చైతన్యాశ్రమం అనబడి, పెద్దల కలల రూపమైన నూతన గ్రంథాలను ఈ సంవత్సరం విడుదల చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

**ఇవి స్వర్ణోత్సవ కెరటాలు.**

ధర్మజీవనానికి అలవాటు పడిన సాహసవంతుడు, ధర్మ రక్షణకు ప్రాణాలొడ్డి శ్రమించిన శీలవంతుడు ధర్మరాజు. యక్షుని ప్రశ్నలకు ధర్మరాజు పలికిన సమాధానాలే యక్ష ప్రశ్నలు. దార్శనిక బాటలో అక్షిని వికాసం చేసే విచిత్ర జ్ఞానము ఈ "యక్ష ప్రశ్నలు" లో దాగివుంది.

